తెలుగు దినపత్రిక

ప్రభాత

jayabheridaily.com

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 01
సంచిక : 17

పేజీలు : 8
వెల : 4

మల్కాజిగిరి

శనివారం, 29-07-2023



జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....

విలేకర్లు కావలెను

ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com

9391 544 889 call me


# కర్ణాటకలో గేమ్ షురూ



**జయభేరి, బెంగళూరు :**

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇంకా వందరోజులు కూడా కాలేదు ఇంతలోనే బీజేపీ ప్రజా తీర్పుకు వ్యతిరేకంగా పావులు కదపడం ప్రారంభించింది. గతంలో కర్ణాటక సహా మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర మరికొన్ని రాష్ట్రాల్లో ప్రజా ప్రభుత్వాలను కూల్చి, గద్దె నెక్కిన కమల దళం, ఇప్పుడు కర్ణాటకలో మళ్ళీ అదే కథను మళ్లీ తెరపైకి తీసుకువచ్చింది. అవును ఇది ఎవరో, ఏ అనామక నాయకుడో చేసిన చిల్లర ఆరోపణ కాదు. బీజేపీని బద్నాం చేసేందుకు నాడు రాజకీయ విశ్లేషకులు చేసిన రాజకీయ వ్యాఖ్యానం కాదు. స్వయంగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ చీఫ్ డీకే శివ కుమార్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించి తమ వద్ద పక్కా సమాచారం ఉందని కూడా డీకే మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. ఒక్క డీకేనే కాదు. మరో మంత్రి కృష్ణ బైరెగౌడ కూడా మరింత స్పష్టంగా బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు.అదే సమయంలో, పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, జిల్లా ఇంచార్జి మంత్రులపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు రాసినట్లు చెపుతున్న నకలీ లేఖ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో డీకే ఆరోపణలకు బలం చేకూరిందని అంటున్నారు. అదే సమయంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మధ్య ఆది నుంచి ఉన్న విభేదాలు అడ్డు పెట్టుకుని, బీజేపీ కాంగ్రెస్ వేలితోనే కాంగ్రెస్ కంట్లో పొడిచే వ్యూహాలకు పదును పెడుతోందని అంటున్నారు. నిజానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం బీజేపీ అగ్ర నాయకత్వానికి తల వొంపులు తెచ్చింది. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాలికి బలపం కట్టుకుని, సర్వం తానై విస్తృతంగా ప్రచారం చేసినా, అమిత్ షా నాయకత్వంలో కేంద్ర నాయకత్వం మొత్తానికి మొత్తంగా కర్ణాటకలో తిష్ట వేసి చక్రం తిప్పినా బీజేపీ ఓటమి పాలు కావడం కమల దళానికి మింగుడు పడలేదు. అందుకే, ఆలస్యం చేయకుండా అర్జెంటుగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ నాయకత్వం సిద్దమైందనే అనుమానాలు సర్వత్రా వ్యక్త మవుతున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి సిద్ద రామయ్య ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన ఐదు గ్యారెంటీలను ఒకటొకటిగా అమలు చేయడంతో కమల దళంలో గుబులు మొదలైంది. ఐదు గ్యారెంటీల విషయంలో సిద్ధూ సర్కార్ సక్సెస్ అయితే ఆ ప్రభావం మరో నాలుగైదు నెలలలో జరగనున్న తెలంగాణ, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ అసెంబ్లీ ఎన్నికల పైనా ఉంటుందని అలాగే ఆ ఎన్నికల ఫలితాల ప్రభావం వచ్చే సంవత్సరం జరగనున్నసార్వత్రిక ఎన్నికల పైనా ఉంటుందని భయపడుతోంది. అందుకే కమల దళం మొగ్గలోనే కర్ణాటక ప్రభుత్వాన్ని కూల్చేందుకు తొందర పడుతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సిద్ధరామయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనికోసం విదేశంలో పథకం రచిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై తమ ప్రభుత్వానికి ఖచ్చితమైన సమాచారం ఉందని వెల్లడించారు. అయితే, బీజేపీ పేరు ఎత్తకుండా ఈ కుట్ర చేసేది ఎవరో తమకు

మిగతా 2 లో

తెలంగాణ సీఎం కేసీఆర్ ఇటీవలి కాలంలో వరుసగా పథకాలు ప్రవేశ పెడుతున్నారు.
ఆ పథకాలన్నీ ఆషామాషీవి కాదు. ప్రజలకు రూ. లక్షలు నగదు బదిలీ చేసేవే.
అన్నీ అమలు చేస్తారా అంటే... అమలు చేయడం ప్రారంభిస్తారు. కానీ ఎన్నికల్లోపు పూర్తి కావు.
ఎన్నికల తర్వాత మాత్రమే ఎక్కువ మందికి అందుతాయి. అలాంటి స్కీమ్స్ నే కేసీఆర్ ఇప్పుడు ప్రకటిస్తున్నారు.
డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం కేసీఆర్‌కు ఎన్ని రకాల విజయాలు అందించిందో చెప్పడం కష్టం.
డబుల్ బెడ్ రూం ఇళ్లేనని రాజకీయవర్గాలు గుర్తు చేసుకుంటాయి.
తలసాని నియోజకవర్గంలో పాడుబడిపోయిన ఇళ్ల స్థానంలో ఓ అపార్టుమెంట్ కట్టించారు.
దాన్నే మోడల్ ఫ్లాట్ గా చూపించి.. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించారు.

2 లో

# పథకాలపైనే ఆశలన్నీ..






## త్వరలోనే "వక్ఫ్ బోర్డ్" సమస్యకు పరిష్కారం




## ఆగని వానలు.. అగ్రనేతల పర్యటనల వాయిదా

**అసెంబ్లీ ఎన్నికల దిశగా శరవేగంతో అడుగులు**
**తెలంగాణ రాజకీయ పార్టీల వేగానికి భారీ వర్షాలు కల్లెం**

## హైదరాబాద్ లో మొహరం ఆంక్షలు



6 లో

# ఒక్క రోజే ఏడాది వాన



**జయభేరి, హైదరాబాద్ :**

ఏడాదంతా కురవాల్సిన వాన ఒక్కరోజులోనే కురిసింది. ఆకాశానికి చిల్లుపడ్డట్టు, కడవలో నీళ్లు గుమ్మరించినట్టు ఏకధారగా కుంభవృష్టి వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో (గురువారం) ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేటలో 64.98 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఫలితంగా జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఇదే అత్యధిక వర్షపాతమని వెల్లడించింది. గతంలో 2013 జూలై 19న వాజేడులో 51.75 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత లక్ష్మీదేవిపేటలో కుంభవృష్టి వాన కురిసిందిజకాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని 35 ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం వర్షం కురిసింది. 200 కేంద్రాల్లో 10 సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో గత 6 గంటల్లో 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ రోజు నగరంలో 30 నుంచి 40 మిల్లీమీటర్ల వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నేడు రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ 60 శాతం అత్యధిక వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 1 నుంచి 321.1 మి.మీ నమోదు కావాల్సి ఉంది. ఐతే ఇప్పటి వరకు దాదాపు 513.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే సగటు సాధారణ వర్షపాతం కంటే ఇది 60 శాతం అధికమని పేర్కొంది.

**పరిస్థితిని సమీక్షిస్తున్న సీఎం, మంత్రులు**

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనల నుంచి ప్రజలను రక్షిస్తూ, ప్రాణనష్ట నివారణ చర్యలు చేపట్టే దిశగా మంత్రులను, ప్రజాప్రతినిధులను, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ

మిగతా 2 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## పథకాలపైనే ఆశలన్నీ....

హైదరాబాద్, జూలై 28, (న్యూస్ పల్స్)

తెలంగాణ సీఎం కేసీఆర్ ఇటీవలి కాలంలో వరుసగా పథకాలు ప్రవేశ పెడుతున్నారు. ఆ పథకాలన్నీ ఆషామాషీవి కాదు. ప్రజలకు రూ. లక్షలు నగదు బదిలీ చేసేవే. కానీ అన్నీ అమలు చేస్తారా అంటే... అమలు చేయడం ప్రారంభిస్తారు. కానీ ఎన్నికల్లోపు పూర్తి కావు. ఎన్నికల తర్వాత మాత్రమే ఎక్కువ మందికి అందుతాయి. అలాంటి స్కీమ్స్ నే కేసీఆర్ ఇప్పుడు ప్రకటిస్తున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం కేసీఆర్‌కు ఎన్ని రకాల విజయాలు అందించిందో చెప్పడం కష్టం. గ్రేటర్ హైదరాబాద్‌లో ఒకప్పుడు బీఆర్ఎస్ పోటీ చేయలేకపోయింది. కానీ అధికారంలోకి వచ్చిన 99 కార్పొరేటర్ సీట్లను గెల్చుకుంది. దీనికి ప్రధాన కారణం డబుల్ బెడ్ రూం ఇళ్లేనని రాజకీయవర్గాలు గుర్తు చేసుకుంటాయి. తలసాని నియోజకవర్గంలో పాడుబడిపోయిన ఇళ్ల స్థానంలో ఓ అపార్టుమెంట్ కట్టించారు. దాన్నే మోడల్ ఫ్లాట్ గా చూపించి.. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించారు. అందు కోసం దాదాపుగా బస్తీల్లో ఉండే.. ముఖ్యంగా ఓట్లు వేసే ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. దరఖాస్తులు ఇచ్చిన వారంతా తమకు ఇళ్లు వస్తాయనే ఆశతో ఉన్నారు. ఇతర పథకాల్లోనూ అదే స్ట్రాటజీ అమలు చేస్తున్నారు. దళిత బంధు పథకాన్ని ఇప్పుడున్న పద్దతిలో అమలు చేయాలంటే.. అందరికీ మరో పాతికేళ్లు పడుతుంది. ఎందుకంటే అంత తక్కువగా లబ్దిదారుల ఎంపిక జరుగుతోంది. బీసీ బంధు, మైనార్టీ బంధు కూడా తెచ్చారు. మరి మాకేంటి అని తెలంగాణలోని అన్ని వర్గాలు అడుగుతున్నాయి. బీసీ బంధు అయినా.. మైనార్టీ బంధు అయినా ఇప్పటికిప్పుడు పూర్తిగా ఇచ్చే పరిస్థితి ఉండదు. తాను మళ్లీ వస్తే అందరికీ వస్తాయని చెప్పడమే సీఎం కేసీఆర్ వ్యూహం. బీసీ చేతివృత్తుల వారికి లక్ష ఆర్థిక సాయం మొదటిదశలో నియోజకవర్గానికి కేవలం 50 మందికే ఇచ్చారు. ఈ లెక్కన 7 వేల మందికి లోపే సాయం అందింది. కానీ, ఈ స్కీం కోసం దాదాపు 5.20 లక్షల అప్లికేషన్లు వచ్చాయి. ఎన్నికల్లోపు అందిన వాళ్లు సరే.. అందాల్సిన వాళ్లు తప్పనిసరిగా సాయం కోసం.. బీఆర్ఎస్‌కు ఓటేయాల్సిందేననే భావన కల్పిస్తారు. కొంత మందికి ఇచ్చిన తర్వాత ఎన్నికలు వచ్చేశాయి..ఇది నిరంతర ప్రక్రియ.. మళ్లీ కేసీఆర్‌కే ఓటేయాల్సిన అనివార్యతను కల్పించాలని వ్యూహం అమలవుతోందని అనుకోవచ్చు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు ముందు వరదలు ముంచెత్తాయి. ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. అందుకే వారికి సాయం చేయడానికి ఇంటికి పదివేల చొప్పున పంపిణీ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. దరఖాస్తులు తీసుకున్నారు. కానీ గ్రేటర్ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించారు. బీజేపీ వల్లే ఇవ్వలేకపోతున్నామని.. ఎన్నికలు అయిపోగానే ఇస్తామని చెప్పారు. కానీ ఆ ప్లాన్ వర్కవుట్ కాలేదు. వరదలు వచ్చిన చోట బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించలేదు. ఆ తర్వాత హుజూరాబాద్ ఉపఎన్నికల్లోనూ అదే పరిస్థితి. కేసీఆర్ ఆ ఎన్నికల్లో ఈటలను ఓడించడానికి ..ఏకంగా దళితులకు ఇంటికి పదిలక్షల చొప్పున ఇస్తామన్న పథకాన్ని ప్రవేశ పెట్టారు. పది హేడు వేల కుటుంబాలకు ఇచ్చారు కూడా. కానీ అక్కడా పరాజయమే ఎదురయింది. ఆర్థిక సమస్యలు కావొచ్చు..కేసీఆర్ రాజకీయ వ్యూహం కావొచ్చు...ప్రకటిస్తున్న పథకాలు అన్నీ అందరికీ చేరవు. కానీ దరఖాస్తులు మాత్రం అందరూ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఈ ప్రభుత్వం దగ్గర మీ దరఖాస్తు ఉంది .. మళ్లీ ఈ ప్రభుత్వం వస్తేనే మీకు నిధులు వస్తాయి అన్న ఓ అభిప్రాయాన్ని పెంచడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. మొదట్లో సక్సెస్ అయిన ఈ స్ట్రాటజీ ఇప్పుడు ఫెయిలవుతోంది. అయినా వచ్చే ఎన్నికల్లోనూ దీన్నే నమ్ముకోవాలని కేసీఆర్ డిసైడయ్యారని నిర్ణయాలను బట్టి అర్థం చేసుకోవచ్చంటున్నారు.

## ఒక్క రోజే ఏడాది వాన

వారికి ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ వస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వరదలకు సంబంధించి పరిస్థితిని పర్యవేక్షిస్తూనే ఉన్నారు. మంత్రులతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడుతూ ప్రాణనష్టం జరగకుండా చూడాలని, అనుకోకుండా ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే వారికి మెరుగైన చికిత్స అందించేలా చూసుకోవాలని సీఎం కోరారు. ఆయా జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులందరూ ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా, అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రక్షణ చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ మంత్రులకు ఫోన్లలో ఆదేశించారు.తక్షణ రక్షణ చర్యల కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు. సీఎం కేసీఆర్ గారి ఆదేశాలను అనుసరించి అన్ని రకాల చర్యలను చేపడుతూ సీఎస్ సెక్రటేరియట్ లో అధికారులతో సమీక్షా సమావేశాలు, టెలీకాన్ఫరెన్స్ లు నిర్వహించారు. ముంపుకు గురైన ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎస్ బృందాలు, రక్షణచర్యల కోసం హెలికాప్టర్లు సహా, ఆహారం, వైద్యం తదితర రక్షణ సామాగ్రి, సంబంధిత శాఖల యంత్రాంగాన్ని పంపించేలా చర్యలు చేపట్టారు. విపత్తుల నిర్వహణ శాఖకు, ఫైర్ సర్వీసుల శాఖకు, పోలీసు శాఖతో సమన్వయం చేస్తూ సహాయక చర్యలు చేపట్టారు. అదే సందర్భంలో పోలీస్ యంత్రాంగాన్ని సహాయక చర్యల్లో పాల్గొనేలా అప్రమత్తం చేయాల్సిందిగా రాష్ట్ర డిజిపిని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు స్టేట్ లెవల్ ఫ్లడ్ మానిటరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసి.డిజిపి పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను తరలించేందుకు పోలీసులు చేస్తున్న కృషి ఫలిస్తున్నది.ఎగువన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి, దాని ఉపనదులు, వాగులు, వంకలు ప్రమాద హెచ్చరికలు దాటి ఉప్పొంగి ప్రవహిస్తున్న పరిస్థితుల్లో, వరద ముంపును తగ్గించే చర్యలు చేపట్టాలనీ, ఈ మేరకు ఇన్ ఫ్లో ను ముందస్తు అంచనా వేసి, గేట్లు ఎత్తివేస్తూ, వరద నీటిని కిందికి వదలాలని చీఫ్ ఇంజనీర్లకు సీఎం కేసీఆర్ ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఎస్సారెస్పీ, కాళేశ్వరం ప్రాజెక్టులు, కడెం ప్రాజెక్టు, మిడ్ మానేరు, లోయర్ మానేరు తదితర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లకు స్వయంగా సీఎం కేసీఆర్ ఫోన్లు చేసి, పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టుల పరిస్థితిని క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారురాష్ట్రంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ ప్రాణనష్టం జరగకుండా చూసేలా చర్యలు చేపట్టాలని ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ, సహాయక చర్యల్లో పాల్గొనాలని మంత్రులకు సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ జిహెచ్ఎంసి పరిధిలో విస్తృతంగా పర్యటన చేపట్టారు. వానలోనే తడుస్తూ, ప్రజలను పరామర్శిస్తూ, అధికార యంత్రాంగానికి ఆదేశాలిస్తూ రక్షణ చర్యల కోసం ముందుకు సాగారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటిస్తూ, సహాయ చర్యలను చేపట్టేలా జిహెచ్ఎంసి అధికారులకు ఆదేశాలిచ్చారు. వరద ముంపుకు గురైన ప్రాంతాలను పర్యటించి ప్రజలకు భరోసానిచ్చారు. జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొనెలా చర్యలు చేపట్టారు.సీఎం కేసీఆర్ మంత్రి సత్యవతి రాథోడ్ కు ఫోన్ చేసి గోదావరి పరివాహక ప్రాంతాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నీట మునిగిన మోరంపల్లి గ్రామంలో ప్రజలను రక్షించేలా పరిస్థితిని సమీక్షించారు. స్వయంగా చలివాగుతో పాటు వరద ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ములుగు ముంపు ప్రాంతంలో కొనసాగుతన్న సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించి, అక్కడే బస చేస్తున్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మపురి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి, పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించి ప్రజలకు ఆహారం, దుస్తులు అందించారు.సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి హరీష్ రావు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, రాష్ట్రస్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి, జిల్లాల్లో కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి ఎక్కడ అవసరమైతే అక్కడ అత్యవసర వైద్య సదుపాయాలు అందించేలా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నిజామాబాద్ జిల్లలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పునరావాస సహాయక చర్యలు చేపట్టారు. సీఎం కేసీఆర్ ప్రశాంత్ రెడ్డికి ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ స్థానిక పరిస్థితులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మేయర్ విజయలక్ష్మి, అధికారులతో సమీక్షించారు.కడెం ప్రాజెక్టు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కడెం ప్రాజెక్టు పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఇంద్రకరణ్ రెడ్డికి ఫోన్ చేసి పరిస్థితులను ఆరా తీశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఉదయం భద్రాచలంలో ప్రత్యేకాధికారి అనుదీప్ తో కలిసి గోదావరి వరద పరిస్థితిని పరిశీలించారు. ఖమ్మం జిల్లా మున్నేరువాగులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు స్వయంగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రంగంలోకి దిగారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో సహాయక కార్యక్రమాలు చేపట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇందుకు సంబంధించి మంత్రి పువ్వాడతో సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షించారు.

# తగ్గనున్న వానలు...
# ఆగమాగమైన 19 జిల్లాలు

**జయభేరి, హైదరాబాద్ :**

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం అల్ప పీడనంగా మారి బలహీన పడుతుందని, వానలు కూడా తగ్గుముఖం పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కె. నాగరత్న తెలిపారు.బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలహీనపడనుండటంతో వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కె. నాగరత్న ప్రకటించారు. కొత్తగా మరో అల్పపీడనం ఏర్పడితే తప్ప తెలంగాణలో భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినట్లేనని చెప్పారు.మరోవైపు తెలంగాణపై నైరుతి రుతుపవనాలు ఉధృతంగా ఉన్నాయి. తాజాగా కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాలు తెలంగాణ రాష్ట్ర చరిత్రలో అతి పెద్ద వర్షాలుగా నమోదయ్యాయి. హనుమకొండ సహా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కొన్ని చోట్ల అసాధారణమైన భారీ వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది.ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం, కుమురంభీమ్ జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షం కురిసినట్లు వివరించారు. ఆగస్టు రెండో వారం, సెప్టెంబరులో కూడా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలున్నాయని తీవ్ర అల్పపీడనంగా బలహీనపడి ప్రస్తుతం దక్షిణ ఒడిశా, పరిసరాల్లో ఉత్తరాంధ్ర వద్ద కొనసాగుతోందని చెప్పారు. శుక్రవారం పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, 29, 30, 31 తేదీల్లో ఎలాంటి హెచ్చరికలు లేవని వాతావరణ కేంద్రం డైరెక్టర్ వివరించారు.తెలంగాణలో వర్షాలు, వరద పరిస్థితులు, సహాయ, పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించడానికి సచివాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రత్యేకంగా ముగ్గురు సీనియర్ అధికారులను నియమించారు. వరద సహాయ చర్యల కోసం 7997950008, 7997959782, 04023450779 నంబర్లను ఏర్పాటుచేశారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్దవానలు కురిసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. ఏడాది పాటు కురవాల్సిన వర్షం ఒక్కరోజులోనే కురిసినట్లు పేర్కొన్నారు. భారీ వర్షాలతో రాష్ట్రంలో 27చోట్ల రోడ్లు తెగిపోయాయి. పలు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో 11 మంది మృతి చెందారు.గోదావరి, కృష్ణా నదుల ఉగ్రరూపంతో ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేశారు. చరిత్రలో కనీవిని ఎరుగని వానతో తెలంగాణ తడిసిముద్దయ్యింది .4 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో వరద బీభత్సం సృష్టించింది.భారీ వర్షాలపై ప్రభుత్వ అప్రమత్తత భారీ ఎత్తున ప్రాణనష్టం జరగకుండా కాపాడింది. వరద పరిస్థితిపై ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతిక్షణం వరద పరిస్థితిని సమీక్షించారు. ప్రాణనష్టం జరగకుండా, వరద బాధితులు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేశారు.




రాష్ట్రంలో ఎడతెరిపి లేని వర్షాలతో నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా అధికార యంత్రాంగం తీవ్రంగా శ్రమించింది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సీఎం కేసీఆర్ వర్షాలు, వరదలపై అధికారులతో మాట్లాడుతూ, తగిన సూచనలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే అధికార యంత్రాంగాన్ని సీఎం అప్రమత్తం చేశారు. గంటగంటకూ పరిస్థితిని సమీక్షించారు. ప్రాణనష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ యంత్రాంగాన్ని సహాయక చర్యల్లో పాల్గొనేలా అప్రమత్తం చేయాలని డీజీపీని ఆదేశించారు. సచివాలయంలో 'స్టేట్ లెవల్ ఫ్లడ్ మానిటరింగ్ సెంటర్'ను ఏర్పాటు చేసి డీజీపీ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. రిజర్వాయర్లలో నీటి పరిస్థితిపై పలు ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లకు సీఎం కేసీఆర్ స్వయంగా ఫోన్‌చేసి ఆరా తీశారు. ఎస్సారెస్పీ, కాళేశ్వరం, కడెం, మిడ్‌మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు.వరద అధికంగా ఉన్న ప్రాంతాల ఎమ్మెల్యేలతో కూడా మాట్లాడి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లకు అవసరమైన నిధులు ఇవ్వాలని ఆర్థిక శాఖకు ఆదేశాలిచ్చారు.కుంభవృష్టి వానలతో పోటెత్తిన వరద ప్రవాహంతో జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. అనేక గ్రామాలు, పట్టణాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా 14 మంది గల్లంతయ్యారు. రెండు వేలకు పైగా ఇళ్లు దెబ్బతిన్నాయని ప్రాథమికంగా అంచనా వేశారు. 5.5 లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. 135 చెరువులకు గండ్లు పడ్డాయని లెక్కించారు.హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట సహా పలు పట్టణాలు, నగరాల్లోని కాలనీలు, వివిధ జిల్లాల్లోని గ్రామాలు ముంపు నీటిలో చిక్కుకున్నాయి. వరదల్లో చిక్కుకున్న ప్రజల్ని ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

# ఆగని వానలు.. అగ్రనేతల పర్యటనల వాయిదా

**జయభేరి, హైదరాబాద్ :**

అసెంబ్లీ ఎన్నికల దిశగా శరవేగంతో అడుగులు వేయాలని, వ్యూహప్రతివ్యూహాలతో ప్రత్యర్థులను దెబ్బ కొట్టాలని ఉత్సాహ పడుతున్న తెలంగాణ రాజకీయ పార్టీల వేగానికి భారీ వర్షాలు కల్లెం వేశాయి. జులై 25 తేదీ నుంచి తెలంగాణవ్యాప్తంగా దంచి కొడుతున్న వర్షాలు తాజాగా రాజకీయ పార్టీ కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా ముందుగా అనుకున్న షెడ్యూళ్ళను మార్చుకోవాల్సిన అవసరాన్ని పొలిటికల్ పార్టీలకు ప్రకృతి కల్పించింది. తెలంగాణలో అయితే కొన్ని ప్రాంతాల్లో ఏడాది మొత్తం మీద కురవాల్సిన వర్షపాతం ఒకటి, రెండ్రోజుల్లోనే నమోదైన పరిస్థితి. నిజామాబాద్ జిల్లా వేల్పూరులో ఏకంగా 46 సెంటీమీటర్ల వర్షపాతం 24 గంటల వ్యవధిలో నమోదైంది. తాజాగా ములుగు జిల్లా వెంకటాపూర్ ఏరియాలో 24 గంటల వ్యవధిలో ఏకంగా 65 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జులై 25 నుంచి 28వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. తాజాగా జులై 28వ తేదీతో వర్షాలకు బ్రేక్ పడుతుందని తెలుస్తున్న తరుణంలో రాజకీయ పార్టీలు ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలను వాయిదా వేసుకోవడం ప్రారంభించాయి.తెలంగాణలో అధికార పార్టీ బీఆర్ఎస్ తామంటే తాము ప్రత్యామ్నాయం అని చెప్పుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు జులై నెలాఖరులో కీలక అగ్రనేతల పర్యటనలను





ఖరారు చేసుకున్నారు. జులై 29న కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనను ముందుగా ఖమ్మంలో అనుకున్న బీజేపీ నేతలు ఆ తర్వాత పార్టీ రాష్ట్ర యంత్రాంగాన్ని అసెంబ్లీ ఎన్నికలకు సిద్దం చేయాలన్న వ్యూహంతో అమిత్ షా పర్యటనను హైదరాబాద్‌కు పరిమితం చేయాలని నిర్ణయించారు. ముందుగా రాష్ట్ర నేతలో భేటీ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత బీజేపీ అనుబంధ మోర్చాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పర్యటన ముగింపులో భాగంగా కీలక నేతలతో ప్రత్యేకంగా సమావేశం కూడా ప్లాన్ చేశారు. తాజాగా అమిత్ షా పర్యటన నిరవధికంగా వాయిదా పడినట్లు టీ.బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆదుకునే కార్యక్రమాలు చేపట్టాలని అమిత్ షా ఆదేశించారని, సహాయ చర్యలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని షా చెప్పారని కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మాట్లాడారు.. తెలంగాణ ప్రజలను సురక్షితంగా కాపాడేందుకు రెస్క్యూ, రిలీఫ్ పనులలో సాధ్యమైన అన్ని సహాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు.. ప్రస్తుతం రెండు హెలికాప్టర్లు సేవలు అందిస్తున్నాయి. అయిదు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా రెస్క్యూ ఆపరేషన్ పనుల కోసం మోహరించారు.. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి..'' అని కిషన్ రెడ్డి ట్వీట్ చేశారు. ఇక మొన్నీమధ్యే రాహుల్ గాంధీ పర్యటన తర్వాత కదనోత్సాహంతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న తెలంగాణ కాంగ్రెస్ కూడా తాము నిర్దేశించుకున్న ప్రియాంక గాంధీ వధేరా పర్యటనను వాయిదా వేశారు. జులై 30న ప్రియాంక కొల్లాపూర్‌లో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు హాజరవ్వాల్సి వుంది. చాలా కాలంగా కాచుకుని కూర్చున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ కండువా కప్పుకునే ఉద్దేశంతో కొల్లాపూర్ బహిరంగ సభను టీ.కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేశారు. తాజాగా ప్రియాంక గాంధీ పర్యటన వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ''ప్రియాంక గాంధీ కొల్లాపూర్ సభను వాయిదా వేశాం.. మరో తేదీని త్వరలో ప్రకటిస్తాం.. భారీ వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఉన్నారు '' అని మల్లు రవి వివరించారు. మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తోపాటు జూపల్లి కృష్ణారావు కూడా కాంగ్రెస్ పార్టీలో ఖమ్మంలో నిర్వహించిన రాహుల్ గాంధీ సభలోనే చేరాల్సి వుండింది. తన సొంత బలం చాటుకునేలా కొల్లాపూర్‌లో సభ నిర్వహించాలని, పొంగులేటి రాహుల్ సమక్షంలో పార్టీలో చేరితే.. తాను ప్రియాంక సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని జూపల్లి భావించారు. ముందుగా జులై 20వ తేదీన కొల్లాపూర్ సభ నిర్వహణకు ప్లాన్ చేశారు. కానీ ఆ తేదీ దగ్గరపడుతున్నా ప్రియాంక రాక కన్ఫర్మ్ కాకపోవడంతో జూపల్లి ఒకింత కలవరపడినా.. చివరికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి జోక్యంతో ప్రియాంక రాకకు తేదీ ఖరారు చేశారు. జులై 30న ఆమె వస్తారని, ఆమె సమక్షంలో జూపల్లి పార్టీలో చేరతారని ప్రకటించారు. అయితే.. ఈ ఏర్పాట్లకిపుడు భారీ వర్షాలు గండి కొట్టాయనే భావించారు. అటు అమిత్ షా పర్యటన వాయిదాతో టీ.బీజేపీ, ఇటు ప్రియాంక రాక వాయిదాతో టీ.కాంగ్రెస్ నేతలు కాస్త నిరాశలో పడినట్లయ్యింది.

# మునిగిన ఓరుగల్లు

**జయభేరి, వరంగల్ :**

తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో ఓరుగల్లు వాసులు విలవిలలాడిపోతున్నారు. దాదాపు 70కి పైగా కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. నగరంలోని రహదారులన్నీ చెరువులను తలపిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.అల్పపీడన ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా వర్షాలు భారీగా కురుస్తున్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు రాత్రికి రాత్రే నిండిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అయితే విస్తారంగా కురుస్తున్న వానల దాటికి ఉమ్మడి ఓరుగల్లు జిల్లా అతలాకుతలం అవుతోంది. ఫలితంగా వరంగల్‌లోని చాలా కాలనీలు వరద గుప్పిట్లోనే చిక్కుకున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ముంపు బాధితులను ఇప్పటికే ఖాళీ చేయించిన అధికారులు... పునరావాసాలకు తరలించారు.వరంగల్ నగరంలో దాదాపు 70 కాలనీలు నీట మునిగాయి. ఇళ్లు, గుడిసెల్లోకి వరద నీరు చేరి నిత్యావసరాలు, సామగ్రి తడిసిపోయాయి. వందలాది మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని అతిభారీ వర్షపాతం నమోదైంది. ఇక వరంగల్ సంతోషి మాత టెంపుల్ దగ్గర భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. గంట గంటకు ఉధృతి పెరుగుతోంది. వరంగల్ రైల్వే స్టేషన్‌లోకి భారీగా వరద నీరు చేరింది. భద్రకాళి ఆలయం వద్ద అయ్యప్పస్వామి గుడిలోకి వరద పోటెత్తింది. వరంగల్‌ఖమ్మం జాతీయ రహదారి జలదిగ్బంధమైంది. పంతిని వద్ద ఊర చెరువు ఉప్పొంగడంతో రోడ్డుపై భారీగా వరద ప్రవహిస్తోంది. నగరంలో



ఉన్న ఎస్ఆర్ వర్శిటీ వద్ద భారీగా వరద నీరు చేరింది. ములుగు రోడ్డు జంక్షన్ వద్ద పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తాళ్ల పద్మావతి కాలేజీ వద్ద ఉన్న మిషన్ భగీరథ పంప్ సెట్‌లోకి కూడా వరద నీరు చేరింది. భవానీ నగర్, నయిమ్ నగర్, శివనగర్, ఎల్బీ నగర్, కొత్తవాడ, కరీంబాద్ తో పాటు చాలా కాలనీలు జలదిగ్బందంలో చిక్కుకుపోయాయి.త్రినగరిలో లోతట్టు ప్రాంతాలు నీటమునిగిపోయాయి. చారిత్రక నగరంలోని రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఖిల్లా వరంగల్ లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. కాకతీయ తోరణాల చుట్టూ వరద నీరు వచ్చి చేరింది. కాశీబుగ్గ పరిధిలోని పలు కాలనీల ప్రజల్ని పునరావాస కేంద్రానికి తరలించారు. భారీ వర్షాలకు పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. చాలా కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

వర్షాల నేపథ్యంలో ఏనమాముల SR నగర్ మునిగిపోయింది. ఇక నగర శివారు ప్రాంతాల్లో ఉన్న చెరువులు ఉధృతంగా పారుతున్నాయి. అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ... సహాయక చర్యలు చేపడుతున్నారు. మరోవైపు గతంలో ఎన్నడూ లేనంతగా తెలంగాణ వ్యాప్తంగా వానలు కురుస్తున్నాయి. వానలపై సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని తనకు తెలియజేయాలని సీఎస్ ను ఆదేశించారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## కర్ణాటకలో గేమ్ షురూ

తెలుసునని డీకే పరోక్షంగా, కమలం పార్టీని వేలెత్తి చూపించారు. బెంగళూరులో ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు చేస్తే తమ ప్రభుత్వానికి తెలుస్తుందని.. కుట్రకు సింగపూర్ ను వేదిక చేశారన్న డీకే.. దానికి సంబంధించిన సమాచారం తమ వద్ద ఉందని పేర్కొన్నారు. వైద్య పరీక్షల కోసం జేడీఎస్ నేత, మాజీ సీఎం కుమారస్వామి సింగపూర్‌కు వెళ్లిన సమయంలోనే డీకే శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేయడం సంచలనంగా మారింది. అయితే కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుతం ఇలాంటి కుట్రలకు భయడదని డీకే ధీమా వ్యక్తం చేశారు. ఒక విధంగా చేతనైతే, సిద్దు సర్కార్ ను కూల్చాలని కమల దళానికి సవాలు విసిరారు. అలాగే రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణ బైరెగౌడ దేశంలో ఎన్నో ప్రభుత్వాలను కూలదోసిన చరిత్ర బీజేపీకి ఉందని ఆరోపించారు. ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నాలు ప్రారంభించిందని అన్నారు. బీజేపీ కుట్రలను వమ్ము చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ద రామయ్య ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రజల చేత రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అన్న ఆయన అందుకే, గతంలో లాగ చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం కాకుండా ముందు నుంచే జాగ్రత్త అవసరమన్నారు. అయితే, అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉన్న నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీలో అనూహ్యంగా అంతర్గత సంక్షోభం ఏర్పడితే తప్ప సిద్దరామయ్య ప్రభుత్వానికి ఇప్పటికిప్పుడు వచ్చిన ముప్పులేదని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రయాణాలు వాయిదా వేసుకోండి

## గోదావరి పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. - మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

**జయభేరి, బాల్కొండ :**
ఏకధాటిగా భారీ వర్షాలు కురియడంతో అనేకచోట్ల చెరువు కట్టలు తెగి రోడ్లపై నుండి వరద జలాలు ప్రవహిస్తున్న దృష్ట్యా మరో రెండు రోజుల పాటు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని రాష్ట్ర రోడ్లుభవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రజలకు హితవు పలికారు. రహదారుల పై నుండి నీరు ప్రవహిస్తున్న ప్రదేశాల్లో ఎంతమాత్రం రోడ్డును దాటే ప్రయత్నం చేయవద్దని జాగ్రత్తలు సూచించారు. మూడవ రోజు కూడా మంత్రి పలు మండలాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో భారీ వర్షాలు కురవడంతో నవాబ్ చెరువు మరియు ఇతర చెరువులు తెగడంతో గ్రామానికి వెళ్లే రహదారులు,బ్రిడ్జ్ లు కోతకు గురికావడంతో అధికారులతో కలిసి పోలీస్ బస్ లో ప్రయాణం చేస్తూ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పోచంపాడ్ శ్రీరామ్ సాగర్ డ్యామ్ పరిశీలనకు వెళుతూ మార్గ మధ్యలో బాల్కొండ మండల కేంద్రంలో నాయకులు,ప్రజల్ని కలిసి మండలంలో కురిసిన భారీ వర్షాల గురించి ఆరా తీశారు..లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి నాయకులు సహాయ సహకారాలు అందించాలని,బియ్యం కూరగాయలు అందించాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో వన్నెల్ బి,బోదెపల్లి,బాల్కొండ మండల ప్రజలను, నాయకుల ను కలుస్తూ గ్రామ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెండోరా మండలం కోడిచెర్ల మరియు సావేల్ గ్రామాల మధ్య రహదారి పై నుండి నిన్నటి వరకు ఉధృతంగా నీరు పారడంతో ఈ రోజు స్థానిక నాయకులతో కలిసి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. అక్కడి నుండే ఆర్ అండ్ బి అధికారులకు కాల్ చేసి ఫోన్ లో శాశ్వత ప్రాతిపదికన ఎం చేయవచ్చునో పరిశీలించాలని అదేశించారు. పోచంపాడ్ శ్రీరామ్ సాగర్ డ్యామ్ కు వరద ఎక్కువగా వస్తుండటంతో సుమారు 30గేట్ల ద్వారా లక్ష 80వేల క్యూసెక్కుల నీరు గోదావరి లోకి వదులుతుండటంతో అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు... శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుండి పెద్ద ఎత్తున ఇన్ ఫ్లో వస్తున్నందున రిజర్వాయర్ దిగువన గల దూదిగాం, సావెల్, కోడిచెర్ల, చాకిరియాల్, బట్టాపూర్, తడపాకల్, దోంచంద, గుమ్మిర్యాల తదితర పరీ



వాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరి నది సమీపానికి వెళ్లే సాహసం చేయవద్దని, అనవసర ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు. ఈ మేరకు ప్రజలెవరూ గోదావరి నది పరిసరాలకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మెండోరా, ఏర్గట్ల మండలాల రెవెన్యూ, పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు. ఎస్సారెస్పీకి భారీగా వరద వచ్చి చేరుతోందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా రిజర్వాయర్లో 80 నుండి 82 టీఎంసీల వరకు నీరు నిలువ ఉంచుతూ, మిగితా వరద జలాలను దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. వరద ప్రవాహం మరింతగా పెరిగినా కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఐదు లక్షల క్యూసెక్కుల వరకు నీటిని దిగువకు విడుదల చేయవచ్చని మంత్రి స్పష్టం చేశారు. గత నలభై, యాభై సంవత్సరాల కాలంలో ఏ ముఖ్యమంత్రులు కూడా ఎస్సారెస్పీని పట్టించుకోలేదని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మొట్టమొదటిసారి ఎస్సారెస్పీ గేట్ల మరమ్మతుల కోసం రూ. 22 కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తు చేశారు. ఒకేసారి అన్ని గేట్ల మరమ్మతులు చేపట్టడం సాధ్యపడనందున విడతల వారీగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం మరో ఆరు గేట్లకు మరమ్మతులు పూర్తి కావాల్సి ఉందని, పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. కాగా, వర్షాలు కొంత తగ్గుముఖం పట్టడం వల్ల వరద తీవ్రత క్రమక్రమంగా తగ్గుతోందని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. గత మూడు రోజుల నుండి తాను క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించడం జరుగుతోందన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని, జిల్లా యంత్రంగం యావత్తు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందన్నారు. వరద తాకిడికి గురైన వారిని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. వర్షపు జలాల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజన వసతి, సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాల వల్ల నివాస గృహాలు దెబ్బతిన్న వారికి ఆపద్బాంధు పథకం కింద ఆదుకుంటామని, పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, చెరువులకు తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించామన్నారు. శాశ్వత మరమాతులకు అవసరమైన అంచనాలను సైతం రూపొందించాల్సిందిగా సూచించామని మంత్రి తెలిపారు. ప్రభుత్వపరంగా అన్ని సహాయక చర్యలు చేపడుతున్నామని, బీ ఆర్ ఎస్ కార్యకర్తలు కూడా ఎక్కడికక్కడ బాధితులను ఆదుకునేందుకు చొరవ చూపాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బాధితులకు భోజన సదుపాయం, ఇళ్ల మరమ్మతులకు ఆర్థిక సహకారం అందించాలని సూచించారు.

# జలపాతాలకు.. జలశాయలకు వెళ్లొద్దు..

**జయభేరి, హైదరాబాద్ :**
కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తెలంగాణ వ్యాప్తంగగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జలపాతాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. యువత వాటిని చూసేందుకు పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు. ప్రకృతి విహారాని వెళ్తున్న వారు కనీస జాగ్రత్తలు తీసుకోకపోతుండడంతో మృత్యువాత పడుతున్నారు. జలపాతాల వద్దకు ఎవరూ రావొద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ములుగు జిల్లాలో చేపల కోసం వెళ్లి మృత్యువాత పడిన ఘటన మరువక ముందే మరో ఘటన జరిగింది. సబితం జలపాతం చూడటానికి వచ్చిన ఓ విద్యార్థి అందులో పడి మరణించాడు.కరీంనగర్ పట్టణం కిసాన్ నగర్‌కు చెందిన మానుపాటి వెంకటేష్ స్నేహితులతో కలిసి సబితం వాటర్ ఫాల్స్ సందర్శనకు వచ్చాడు. ప్రకృతిని ఆస్వాదిస్తూ రాళ్లపై నుంచి జారి పడి మృతి చెందాడు. స్థానికులు, రెస్క్యూ టీం తీవ్రంగా గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. జలపాతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేయడంతో ప్రమాదం జరిగినట్లు పర్యాటకులు చెబుతున్నారు.నీటి ప్రవాహం అధికంగా ఉందని ఎవరు సందర్శనకు రావద్దని ఎన్ని మార్లు విన్నవించిన పర్యాటకులు పట్టించుకోవడం లేదని పోలీసు



చెబుతున్నారు. భద్రత గురించి ఎంత చెప్పినా వినడం లేదని అంటున్నారు. వాటర్ ఫాల్స్ దగ్గరకు రావొద్దని చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారని చెబుతున్నారు. ఏదైనా విహార యాత్రకు వెళ్లినప్పుడు కనీస జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. విహారయాత్ర విషాద యాత్ర కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండలం వీరభద్రవరం గ్రామ సమీపంలోని అడవిలో చిక్కుకున్న 84 మంది పర్యాటకులను పోలీసులు రక్షించారు. ముత్యంధార జలపాతం చూసేందుకు 84 మంది పర్యాటకులు బుధవారం అటవీ ప్రాంతానికి వచ్చారు. హైదరాబాద్ సహా పలు ప్రాంతాల నుంచి 12 కార్లు, 10ద్విచక్ర వాహనాలపై నుంచి పర్యాటకులు బొగత జలపాతాన్ని చూసేందుకు వచ్చారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగడంతో వారంతా అడవిలోనే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు అధికారులు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. పోలీసులు, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో పర్యాటకులను అడవిలో నుంచి బయటకు తీసుకొచ్చారు. పర్యాటకులు క్షేమంగా బయటపడ్డారని పోలీసులు తెలిపారు. ఇటీవలే ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వాగులో చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వృద్ధుడు గల్లంతయ్యాడు. భోదాపురం పంచాయతీ సీతారాంపురం గ్రామానికి చెందిన బొగ్గుల బండయ్య(70) గ్రామం సమీపంలోని పెదవాగులో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో గాలం ( చేపలు పట్టే పరికరం) వాగులో తట్టుకుంది. దీంతో ప్రవహిస్తున్న వాగులోకి బండయ్య దిగాడు. వాగు వేగంగా ప్రవహించడంతో ఒక్కసారిగా అదుపుతప్పి వాగులో మునిగి గల్లంతయ్యాడు.



# త్వరలోనే "వక్ఫ్ బోర్డ్" సమస్యకు పరిష్కారం

**జయభేరి, మేడిపల్లి :**
తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ మరియు ఐటీ శాఖల మంత్రివర్యులు గౌరవనీయులు కల్వకుంట్ల తారకరామారావు( KTR )గారిని కలిసి వక్ఫ్ బోర్డ్ సమస్య పరిష్కరించాలని వినతి పత్రం అందజేసిన బోడుప్పల్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి. సానుకూలంగా స్పందించిన మంత్రివర్యులు కేటీఆర్ గారు త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొన్ని సంవత్సరాలుగా సుమారు పదివేల కుటుంబాల పేద, మధ్య తరగతి ప్రజలు 'వక్ఫ్ బోర్డ్" సమస్యతో తాము కొన్న స్థలాలలో ఇల్లు కట్టలేక,ఇల్లు కట్టిన వాళ్ళు పిల్లల చదువుల కోసం,పెళ్లిళ్ల కోసం అమ్మ లేక,తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. "వక్ఫ్ బోర్డ్" బాధితులు తమ సమస్య పరిష్కారానికి ఎన్నోమార్లు కమిషనర్కు,అధికారులకు విన్నవించి సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు.వక్ఫ్ బోర్డ్ సమస్య పరిష్కారం కోసం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఐటీ శాఖల మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు గారిని కలిసి "వక్ఫ్ బోర్డ్"పరిధిలో ఉన్న సర్వే నెంబర్లను రెగ్యులరైజ్ చేయాలని,విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మా రెడ్డి గారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ సమస్య వల్ల బోడుప్పల్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను సవివరంగా వివరించామని, సానుకూలంగా స్పందించిన మంత్రి కేటీఆర్ గారు అతి త్వరలో వక్ఫ్ బోర్డ్ సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీఇచ్చారని సింగిరెడ్డి పద్మా రెడ్డి గారు అన్నారు. అదేవిధంగా "వక్ఫ్ బోర్డ్" సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తున్న మంత్రి మల్లారెడ్డి గారికి,మంత్రి కేటీఆర్ గారికి బోడుప్పల్ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని బోడుప్పల్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి గారు అన్నారు.



# గ్రీన్ బిల్డింగ్ వల్ల దేశంలో గ్రీన్ ఇండ్లు

**జయభేరి, మేడిపల్లి :**
హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (IGBC) గ్రీన్ ప్రాపర్టీ షో 2023 ప్రారంభోత్స వ కార్యక్రమంలో ఐటి, MA&UD మంత్రి కేటీఆర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, సింగిరెడ్డి పద్మా రెడ్డి, ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం తరపున CIIIGBCకి పూర్తి సహకారం అందిస్తాం. రాష్ట్రంలో గ్రీన్ బిల్డింగ్ అనేక రికార్డులను కలిగి ఉంది. భారతదేశపు మొదటి గ్రీన్ బిల్డింగ్, గ్రీన్ హోమ్, గ్రీన్ ఎయిర్‌పోర్ట్, గ్రీన్ రైల్వే స్టేషన్, గ్రీన్ ఫ్యాక్టరీ ఇలా ఇవన్నీ గ్రీన్ బిల్డింగ్ విజయాలు. ఈ గ్రీన్ బిల్డింగ్ వల్ల దేశంలో గ్రీన్ ఇండ్లు పెరుగుతున్నాయి. CIIIGBC హైదరాబాద్‌లో 10.27 బిలియన్ చదరపు అడుగుల్లో నిర్మాణాలు పూర్తిచేసింది' అని చెప్పారు. కొత్త సచివాలయ భవనం, టీహబ్, టీవర్క్స్, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, కొత్త కలెక్టరేట్ భవనాలు, ఆస్పత్రులు, హెల్త్‌కేర్ క్యాంపస్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ఐటీ టవర్లలో గ్రీనరీ ఇంప్లిమెంట్ చేయడం ద్వారా తెలంగాణ పచ్చని బాటలో నడుస్తోందని మంత్రి కేటీఆర్ చెప్పారు. భవనాలు, క్యాంపస్‌లు మాత్రమే కాకుండా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌లలో IGBC ద్వారా గ్రీన్ సిటీస్ రేటింగ్ పెరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణకు హరిత హారం ద్వారా రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో 24% నుంచి 33% శాతం వరకు పచ్చదనం పెరిగిందని మంత్రి చెప్పారు. చెట్ల విస్తరణను గణనీయంగా పెంచుకున్నామని, దాంతో రాష్ట్రం మొత్తం పచ్చదనం పెరిగిందని తెలిపారు. నగరాలేగాక రాష్ట్రంలోని చాలా గ్రామాల్లో కూడా గ్రీన్ బిల్డింగ్ సూత్రాలను అవలంభించాలని కోరుకుంటున్నామని చెప్పారు. గంగదేవిపల్లి స్ఫూర్తిగా రాష్ట్రంలోని వెయ్యి గ్రామాలను గ్రీన్ విలేజెస్‌గా మార్చేందుకు IGBC సహకారం కావాలన్నారు. గ్రామీణ విద్యుదీకరణ, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, మున్సిపల్ వ్యర్థాల నిర్వహణను మెరుగుపర్చడానికి, గ్రామాలు పచ్చగా మారడానికి వీలుగా పటిష్టమైన మౌలిక సదుపాయాల కల్పనపై తాము దృష్టి పెడుతున్నామని మంత్రి తెలిపారు.



# చిల్కానగర్ డివిజన్ సమస్యలపై మంత్రి కేటీఆర్ కువినతి పత్రం

**జయభేరి, ఉప్పల్ :**
చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ డివిజన్లోని పలు సమస్యలపై ఐటి మరియు మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కేటీఆర్ గారిని కలిసి బిలేటెడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, చిల్కానగర్ డివిజన్లోని నార్త్ కళ్యాణ్ పూరి కాలనీ లేఅవుట్ ని ఓపెన్ స్పేస్ జోన్ నుండి రెసిడెంటిల్ జోన్ కి మార్చినందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతూ, జోన్ మార్పిడి లో భాగంగా 1 కోటి 42 లక్షల రూపాయలు కట్టాల్సిందిగా జీవో కాపీలో ఉండడం, దాన్ని 50 శాతానికి కుదించాల్సిందిగా కేటీఆర్ గారిని కోరడం జరిగింది, వారు సానుకూలంగా స్పందిస్తూ కచ్చితంగా రుసుము తగ్గించే ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు రోడ్లు మరియు సీవరేజ్ లైన్లో బాగా దెబ్బతిన్నాయని వాటి మరమ్మతుకు వెంటనే నిధులు కేటాయించాలని కేటీఆర్ కోరినట్టు కార్పొరేటర్ గీతా ప్రవీణ్ తెలిపారు. అదేవిధంగా ktr ఉప్పల్ పర్యటనలో భాగంగా వచ్చిన సందర్భంలో చిల్కానగర్ డివిజన్ కి 50 పడకల ఆసుపత్రిని, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ కొరకు ఇచ్చిన వినతిపత్రం విషయాన్ని గుర్తు చేస్తూ, సాంక్షన్ చేయాల్సిందిగా కోరినట్టు కార్పోరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, మహమూద్, శ్యామ్, బాలు మొదలగువారు పాల్గొన్నారు.

# దేశ రాజధాని ఢిల్లీ లో దారుణం

## విద్యార్థినిపై యువకుడు ఇనుపరాడ్డు తో దాడి..హత్య

**జయభేరి, న్యూ ఢిల్లీ :**
దేశ రాజధాని ఢిల్లీ లో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ యువకుడు విద్యార్థినిపై ఇనుపరాడ్డు తో దాడి చేసి దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన నగరంలోని అరబిందో కళాశాల సమీపంలోని విజయ్ మండల్ పార్క్ లో శుక్రవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థిని నగరంలోని కమలా నెహ్రూ కాలేజీలో చదువుతోంది. తన 25 ఏళ్ల స్నేహితుడితో కలిసి అరబిందో కళాశాల సమీపంలోని పార్కుకు వచ్చింది. ఈ క్రమంలో విద్యార్థినిపై ఆమె స్నేహితుడు రాడ్డుతో దాడి చేసి హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. 'దక్షిణ ఢిల్లీలోని మాల్వీయా నగర్ లోని అరబిందో కళాశాల సమీపంలోని పార్కులో యువతి మృతదేహం లభ్యమైందని మాకు సమాచారం అందింది. సదరు విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి పార్కుకు వచ్చింది. ఆమె తలపై గాయాలు ఉన్నాయి. డెడ్ బాడీ సమీపంలో ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నాం. నిందితుడి కోసం గాలిస్తున్నాం' అని దక్షిణ ఢిల్లీ డీసీపీ చందన్ చౌదరి తెలిపారు.

ప్రభాత జయభేరి
jayabheridaily.com

## ఉప్పొంగిన మున్నేరు...

**జయభేరి, సూర్యాపేట :**

హైద్రాబాద్ విజయవాడ నేషనల్ హైవేపై రాకపోకలు నిలిచాయి. మున్నేరు వాగు ఐతవరం వద్ద హైవేపై ఉప్పొంగి ప్రవహిస్తోంది. హైద్రాబాద్ నుంచి ఏపి వెళ్ళే వాహనాలను కోదాడ, హుజూర్ నగర్, మిర్యాలగూడ మీదుగా మళ్లించారు. ఈ నేపధ్యంలో కోదాడ హుజూర్ నగర్ రహదారిపై 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

## పెరిగిన వరద ఉధృతి

**జయభేరి, జగ్గయ్యపేట :**

లింగాల పెనుగంచిప్రోలు మున్నేరు బ్రిడ్జి లు పై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న దుకాణాలు, కళ్యాణకట్టలకు వర్షపు నీరు చేరింది. మున్నేరు పరివాహ ప్రాంతం హరిజనవాడ లోని గృహాలను వరద నీరు చుట్టుముట్టింది. దాంతో అధికారులు సుమారు 20 గ్రామాలు పై గా రాకపోకలు నిలిపివేసారు. వ్యాపారులు దుకాణాల్లో బొమ్మలను , సామాగ్రిని ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. సామాగ్రి కోసం వెళ్లే దుకాణదారులను వద్దని ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. అమ్మవారి కి (తలనీలాలు) కళ్యాణ్ కట్టలు లో మొక్కలు చెల్లించుకున్నందుకు వచ్చిన భక్తులను ఆలయ అధికారులు ఆపివేసారు. కళ్యాణకట్ట పూర్తిగా నీట మునిగింది.

## మంత్రి జోగి రమేష్ ఇంటిని ముట్టడిస్తం

**జయభేరి, నూజివీడు :**

ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలో జనసేన ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణాజిల్లాల జనసేన అధికార ప్రతినిధి మరీదు.శివరామకృష్ణ మాట్లాడుతూ పేదల స్థలాలు,జగనన్న కాలనీ ఇళ్ళు పంపిణిలో అవినీతి,అక్రమాలను గుర్తించలేని గృహ నిర్మాణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గురించి అవాకులు చవాకులు పేలితే చూస్తూ ఊరుకోమని జోగి రమేష్ కు వార్నింగ్ ఇచ్చిన జనసైన్యం.జనసేన పార్టీ పిలుపు మేరకు శనివారం నుండి వైసీపీ ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ళ నిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకలను బట్టబయలు చేసే కార్యక్రమం చేపట్టనున్నట్టుగా తెలిపిన జనసేన నాయకులు. మంత్రి జోగి రమేష్ మరోసారి ఇష్టారాజ్యంగా మాట్లాడితే రాష్ట్రంలో జనసేన నాయకులు అందరూ మంత్రి జోగి రమేష్ ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.

## పోటెత్తిన వశిష్ట గోదావరి.. పంటు రాకపోకలు నిలిపివేత

**జయభేరి, నరసాపురం :**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల మూలంగా పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వశిష్ట గోదావరి వరద నీటితో పోటెత్తుతుంది. శుక్రవారం వరద ప్రభావం మూలంగా ఉభయ గోదావరి జిల్లాల పంటు రాకపోకలు నిలిపివేశారు. పందు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని రెండవ వార్డు 29వ వార్డులలో వరద నీరు చేరడంతో మునిసిపల్ అధికారులు కన్జర్వెన్సీ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొండపల్లి వద్ద ఏటిగట్టు పై నరసాపురం మున్సిపల్ కమిషనర్ కే వెంకటేశ్వరరావు దగ్గరుండి రెండో వార్డులో చేరిన వరద నీరుని మోటార్ల సహాయంతో తోడిస్తున్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీబ్యారేజీ 85 గేట్లు ఎత్తివేత

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :**

కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరడంతో ప్రాజెక్టులోని లక్ష్మీబ్యారేజీ 85 గేట్లు ఎత్తివేసారు. మేడిగడ్డ బ్యారేజీకి ఇన్ ఫ్లో 8.21 లక్షల క్యూసెక్కులు, అన్నారం బ్యారేజీకి గోదావరి నుంచి 7.61 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. మానేరు నుంచి అన్నారం బ్యారేజీకి 5.33 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో, అన్నారం బ్యారేజీకి ఉన్న మొత్తం 66 గేట్లు ఎత్తివేసారు. అన్నారం బ్యారేజి నుంచి మొత్తం 12.95 లక్షల క్యూసెక్కులు విడుదల చేసారు.

## విద్యుత్ దిమ్మెను ఢీకొట్టిన కారు.. ప్రయాణికులు క్షేమం

**జయభేరి, పెద్దపల్లి :**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ చెరువు కట్ట సమీపంలో ట్రాన్స్ఫర్మర్ దిమ్మెను కారు ఢీ కొట్టింది. కారులో ఐదుగురు వ్యక్తులు ఇరుక్కుపోయారు. స్థానికులు కారు అద్దాలు పగల గొట్టి వారిని కాపాడారు. ఐదుగురు వ్యక్తులకు ప్రమాదం తప్పింది. కారులో ఉన్న వ్యక్తులు గోదావరిఖని వాసులుగా గుర్తించారు.



## ములుగు జిల్లా వరదలో గల్లంతైన ఎనిమిది మంది మృతి

**జయభేరి, ములుగు :**

జిల్లాలో రెండు, మూడు రోజులుగా కురుస్తు్ను భారీ వర్షాలకు జనజీవనం స్థంభించిపోయింది. వాగులు, వంకలు పొంగి పొర్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామంలో గురువారం వరదలో గల్లంతైన ఎనిమిది మంది మృతి చెందారు. శుక్రవారం ఉదయం గల్లంతైన వ్యక్తులలో నాలుగు మృతదేహాలు లభించగా మధ్యాహ్నం వరకు మరో నాలుగు మృతదేహాలు లభించినట్లు సమాచారం.దీంతో గడిచిన 24 గంటల్లో ములుగు జిల్లాలో తొమ్మిది మంది వ్యక్తులు వరదల కారణంగా మృతి చెందారు. వర్షం కొంత తెరిపివ్వడంతో జలదిగ్బందంలో చిక్కుకుని మునిగిపోయిన ఇండ్లు తేలాయి. గ్రామంలో ఎక్కడ చూసినా రోడ్లు ధ్వంసమైపోయాయి. వరద ఉధృతికి పలుచోట్ల రహదారి కొట్టుకుపోయాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# సఖి సెంటర్ ద్వారా అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జయభేరి, జగిత్యాల :**

బాధిత మహిళలకు సాంత్వన కల్పించేందుకు వాన్ స్టాఫ్ సఖి సెంటర్ ద్వారా అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం రోజున పట్టణంలోని ధరూర్ క్యాంపు సమీపంలో నూతనంగా నిర్మించిన సఖి కేంద్రా భవనాన్ని మంత్రి ప్రారంభోత్సవం చేశారు. తొలుత పూజా కార్యక్రమాలు నిర్వహించి కేంద్రంలోని పలు గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మహిళల ప్రతీ సమస్య కౌన్సిలింగ్ ద్వారా పరిష్కారం చూపడానికి సఖి కేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. సఖి కేంద్రం సేవల వివరాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియజేస్తూ విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు, గ్రామీణ ప్రాంత మహిళా ఉద్యోగులకు సఖి కేంద్రం ద్వారా అందించే న్యాయ, వైద్య, కౌన్సిలింగ్ సేవల వివరాలను తెలియజేయాలని అన్నారు. సామాజిక బాధ్యతతో సాటి మహిళలకు సహకారం అందించాలని సఖి కేంద్రంలో పనిచేసే ఉద్యోగులను కోరారు. సఖి కేంద్రానికి ప్రహరి గోడ నిర్మించేందుకు నిధులు సమకూర్చుతామని, సెక్యూరిటి కల్పనకు ఎస్పీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆనంతరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత మాట్లాడుతూ



మహిళలకు రక్షణ, భరోసా కల్పించేందుకు సఖి వాన్ స్టాఫ్ కేంద్రం దోహదపడుతుందని అన్నారు. 5 రకాల సేవలు అందించే వివరాలపై విస్తృత ప్రచారం కల్పించాలని, మహిళల చట్టాలపై అవగాహన కల్పించాలని సుమారు 68 వేల మందికి పైగా సఖి కేంద్రం సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.ఆనంతరం జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా అందించే సేవలను బాధిత మహిళలు సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. ఆనంతరం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా మాట్లాడుతూ మహిళలపై పలు ప్రాంతాలలో జరిగిన లైంగిక వేధింపుల నేపథ్యంలో నిర్భయ చట్టం అమలులోకి రావడం జరిగిందని అన్నారు. 2019 ఏప్రిల్ లో సఖి కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాలలోని బాధిత మహిళలకు కౌన్సిలింగ్, వైద్య సేవలు, న్యాయ సహకారం, పోలీసుల సహకారం అందించడం జరుగుతుందని, బాధితురాలికి 5 రోజుల పాటు షెల్టర్ ఇవ్వడం జరుగుతుంది అన్నారు. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో సఖి కేంద్రాలు నిర్వహిస్తారని అన్నారు. దోషికి శిక్ష పడే విధంగా న్యాయ సహకారం సఖి కేంద్రం ద్వారా అందించడం జరుగుతుందని, పోలీసుల రక్షణ కల్పించడంతో పాటు వైద్య సెలవు అందించడం జరుగుతుందని అన్నారు. మహిళల చట్టాలపై స్వయం సహాయక సంఘాలకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు, పనిచేసే చోట మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆనంతరం
జిల్లా ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ బాధితురాలికి చట్టపరంగా సహకారం అందించేందుకు సఖి కేంద్రం పనిచేస్తుందని, అదే విధంగా భరోసా కేంద్రాల ద్వారా కూడా సహకారం అందించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి, రక్షణకు షీ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆనంతరం అదనపు కలెక్టర్ బి.ఎస్. లత మాట్లాడుతూ వేధింపులకు గురైన మహిళలకు సఖీ కేంద్రం సేవలందిస్తుందని అన్నారు. కేంద్రం ద్వారా సహకారం పొందిన మహిళలు వారి జీవితాన్ని విజయవంతంగా భవిష్యత్ ప్రణాళికలతో కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్,డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీలత, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి నరేష్, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాస్, ప్రకృతి స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి జయశ్రీ, సఖి కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది, అంగన్ వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

# ఓ ఆర్ ఆర్ రోడ్లపై వివరాలు ఇవ్వాల్సిందే

**జయభేరి, హైదరాబాద్ :**

ఓఆర్ఆర్ టెండర్ల సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నారని, ఆర్టీఐ పిటిషన్ ద్వారా అడిగినా ఇవ్వడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హైకోర్టులో దాఖలు చేసుకున్న పిటిషన్పై విచారణ జరిగింది. ఆర్టీఐ ఉన్నది ఎందుకని విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలకు కూడా అడిగిన సమాచారం ఇవ్వకపోతే చట్టసభల్లో ఏం మాట్లాడుతారని ప్రశ్నించింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అడిగిన సమాచారం మొత్తం ఇస్తామని ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ కోర్టుకు తెలిపారు. రెండు వారాల్లోగా రేవంత్ రెడ్డి అడిగిన సమాచారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. జూలై 26న ఆయన తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఓఆర్ఆర్లీజు టెండర్ల విషయంలో అధికార బీఆర్ఎస్ హస్తం ఉందని ఆయన పదే పదే ఆరోపిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీఐ కూడా సమాచారం ఇవ్వకపోవడం.. ప్రభుత్వం నుంచి పెద్దగా స్పందన రాకపోవడంతో హైకోర్టులో వేసిన పిటిషన్ రాజకీయవర్గాల్లో చర్చనయాంశమయింది. ఆర్టీఐకి కమిషనర్లు లేకపోవడంతోనే సమాచారం రావడం లేదని చెబుతున్నారని పిటిషన్లో పేర్కొన్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఓఆర్ఆర్ లీజ్ పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కొంత కాలంగా సంచలన ఆరోపణలు చేస్తున్నారు. ఓఆర్ఆర్ లీజులో భారీ స్కామ్ జరిగిందని, ఈ కుంభకోణంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయలు చేతులు మారాయని రేవంత్



రెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ ఓఆర్ఆర్ లీజ్ స్కాములో తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సీఎస్ సోమేష్ కుమార్, ఐఏఎస్ అరవింద్ కుమార్ కీలక పాత్రధారులు అంటున్నారు. ఓఆర్ఆర్ లీజ్ స్కామ్ లో విచారణ సంస్థకు ఆధారాలతో సహ ఫిర్యాదు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులకు కీలకంగా మారిన ఓఆర్ఆర్ కు ప్రతి సంవత్సరం రూ. 700 నుండి రూ.800 కోట్ల వరకు టోల్ రూపంలోనే వస్తాయని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఈ టెండర్ దక్కించుకునేందుకు నాలుగు కంపెనీలు టెండర్ల కోసం బిడ్లు దాఖలు చేయగా.. దరఖాస్తుల పరిశీలన తర్వాత ఐఆర్బీ ఇన్ఫ్రా లిమిటెడ్ ఎల్ 1గా నిలిచింది. మొత్తం రూ.7,380 కోట్లకు బిడ్ ఖరారు అయింది. అంతర్జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచింది. మార్చి నెలాఖరుకు టెండర్ గడువు ముగిసిన తర్వాత మొత్తం 4 కంపెనీలు తమ బిడ్లను దాఖలు చేశాయి. ఎక్కువగా కోట్ చేసిన సంస్థకు ఓఆర్ఆర్ ను టోల్ ఆపరేట్ ట్రాన్స్ఫర్ విధానంలో లీజుగు అప్పగించారు. ఇందులో భాగంగా ముంబయికి చెందిన ఐఆర్బీ ఇన్ఫ్రా లిమిటెడ్ కి బిడ్ దక్కింది. ఇందులో అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఓఆర్ఆర్ ను మొత్తం 158 కిలోమీటర్ల మేర నిర్మించారు. జాతీయ, రాష్ట్ర రహదారులు దీనికి అనుసంధానమై ఉన్నాయి. ఓఆర్ఆర్ పై ఎక్కి, దిగడానికి 44 పాయింట్లు ఉన్నాయి. 22 ఇంటర్ ఛేంజ్ జంక్షన్లు ఉన్నాయి. టోల్ వసూళ్ల కింద ఏటా రూ.400 నుండి రూ.450 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఏటా 5 శాతం వరకు పెంచుకునే వెసులుబాటు ఉంది. అయితే రేవంత్ రెడ్డి ఆరోపణలన్నీ తప్పని ఇప్పటికే హెచ్ఎండీఏ ఆయనపై పరువు నష్టం పిటిషన్లు దాఖలు చేసింది. అవి కూడా కోర్టులో ఉన్నాయి.

# జగనన్న సురక్షతో ప్రజలు లబ్ధిపొందారు

**జయభేరి, తిరుపతి :**

సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా పేదలకు మంచిచేసే మహారాజుగా పేదల గుండెల్లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నిలిచిపోయారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం తిరుపతి నగరంలో 5, 9 డివిజన్లకు సంబంధించి కొర్లగుంట వై.ఎస్.ఆర్ మార్గ్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన క్యాంపులలో సర్టిఫికెట్లను అందజేసే కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అర్బన్ ఎమ్మార్వో వెంకట రమణ, కార్పొరేటర్లు పుల్లూరు అమర్నాధ్ రెడ్డి, ఆధం లీలావతి హాజరై సర్టిపికెట్లు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ తానిచ్చిన హామీలను 98 శాతంకు పైగా నేరవేర్చి, భారతదేశంలోని ముఖ్యమంత్రుల్లో మొట్ట మొదటి వ్యక్తిగా జగన్ మోహన్ రెడ్డి నిలవడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు మూడు లక్షల ముప్పై వేల కోట్ల రూపాయలను సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అందించిన జగన్మోహన్ రెడ్డికి మనమంతా మరింత తోడ్పాటును అందిస్తే రాబోవు కాలంలో మరింత అభివృద్ధికి పాటు పడుతారని, జగనన్న మళ్లీ అధికారంలోకి రావడానికి మీ అందరి తోడ్పాటు అవసరమని ప్రజలనుద్దేశించి భూమన అభ్యర్థించారు. తిరుపతి నగరం అభివృద్ధికి పని చేస్తున్నామని, మాస్టర్ ప్లాన్ రోడ్లను తీసుకురావడం జరుగుతున్నదని, ఇప్పటికే ఉపయోగంలోకి వచ్చిన మాస్టర్ ప్లాన్ రోడ్ల వలన ప్రజలు ప్రయోజనాలు పొందుతున్నారని, తిరుపతి అభివృద్ధికి ముఖ్యమంత్రి అనేక విధాలుగా కృషి చేస్తున్నారని భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత వుండి పథకాలు పొందలేని వారిని గుర్తించి, వారికి అవసరమైన సర్టిఫికెట్లు అందించి, పథకాలు వచ్చేందుకు రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయం ద్వారా వేలల్లో ప్రజలు సర్టిఫికెట్లు పొందుతున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి



తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాలకే బడ్జెట్ ను ఖర్చు పెడుతున్న జగన్ మోహన్ రెడ్డిని ఆదరించాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేసారు. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో నవరత్నాల మ్యానిఫెస్టోతో ప్రజలకు హామిలు ఇచ్చి, ఆధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను 98 శాతం వరకు పూర్తి చేశారన్నారు. అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్రం ఆర్ధిక లోటులో ఉన్నప్పటికీ, పేద ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలనే సంకల్పంతో ముందుకు కదులుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి మనమంతా తోడ్పాటు ఇవ్వాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రజాభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులను గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా మరింత చేరువు చేస్తూ దానిలో భాగంగానే పథకాలకు ఇంకా ఎవరైన అర్హత వున్నారా అనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చి, అన్ని సర్టిఫికెట్లు ఉచితంగా అందించడం జరుగుతున్నదని మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలన్నిటిలో ఇంకా కూడా కొన్ని కారణాల వలన లబ్ధి పొందని వారు ఉన్నారని, వారికి అవసరమైన సర్టిఫికెట్లు కొన్ని లేకపోవడం ద్వారా సంక్షేమ ఫలాలు అందుకోలేక పోతున్నారనే విషయాన్ని గ్రహించి, 11 రకాల ముఖ్యమైన సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి ఉచితంగా అందించడం జరిగిందన్నారు. తిరుపతి నగరంలో 102 సచివాలయాల ద్వారా 43 వేల సర్టిఫికెట్లను ఉచితంగ అందించడం జరిగిందని, గడిచిన నెల రోజులుగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రమించిన సచివాలయ కార్యదర్శులకు, వాలంటీర్లకు, కార్పొరేటర్లకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి, ప్రభుత్వాన్ని ప్రజల ముంగిటకు తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో ఫింక్షన్ల కోసం పడిగాపులు కాసే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నేడు ఒకటవ తేది ఉదయం ఐదు గంటలకే ఇంటి వద్దకే వారికి ఫించన్లు అందిస్తున్న ఘనత జగన్ మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు తోడుగా నిలుద్దామన్నారు. తిరుపతి నగరం ఒక వైపు సంక్షేమదిశగా, మరో వైపు అభివృద్ధి దిశగా దూసుకుపోతున్నదని భూమన అభినయ్ అన్నారు. 17 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధిలోకి తీసుకువస్తున్నామని, ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన వై.ఎస్.ఆర్ మార్గం, అన్నమయ్య మార్గం, సీతమ్మ నగర్ మార్గం, సామవాయి మార్గం వలన ప్రజలు చాలా సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నట్లు వివరించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఏడు ఫ్రీ లెఫ్టులను తీసుకురావడం జరిగిందన్నారు. రానున్న కాలంలో తిరుపతిని మరింత అభివృద్ధి వైపు తామంతా కలిసి తీసుకెల్లడం జరుగుతుందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి స్పష్టం చేసారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ మాట్లాడుతూ 151 మంది ఎమ్మెల్యేలను, మంత్రులను ఇంటింటికి పంపించి ప్రజా సమస్యలను పరిష్కరించేలా పని చేయాలని చెబుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ఆదరించాలన్నారు. పేద ప్రజలకు అండగా వుంటూ ప్రజా పథకాలు ఇన్ని అందిస్తున్న జగనన్నను మళ్ళీ గెలిపించుకుంటె మరెన్నో పథకాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రుద్రరాజు శ్రీదేవి, ఇమామ్ షాహేబ్, టౌన్ బ్యాంక్ చైర్మెన్ కేతం జయచంద్రా రెడ్డి, నాయకులు ఆధం సుధాకర్ రెడ్డి, దొడ్డారెడ్డి మురళీ, చోటా భాయ్, రవి, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, క్యాంప్ కోఆర్డినేటర్లు సుపర్డెంట్ రవి, శశి తదితరులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కు దరఖాస్తు చేసుకోవాలి

**జయభేరి, జగిత్యాల :**

జగిత్యాల పట్టణంలోని గృహం లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పొందుటకు అర్హులైన ప్రజల నుండి మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు.ఆగస్టు 05, 2023 వరకు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డు,ఆధార్,ఆదాయం, కులం సర్టిఫికెట్లతో పాటు జగిత్యాల నివాసి అయిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకొని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## 29 నుంచి రొట్టెల పండుగ

**జయభేరి, నెల్లూరు :**

మత సామరస్యానికి ప్రతీకగా జరిగే రొట్టెల పండుగ గురించి ఎప్పుడైనా విన్నారా ?. అయితే దీని గురించి తెలుసుకోవాల్సిందే. ఈ పండగ కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా అక్కడకు భక్తులు క్యూ కడుతుంటారు. అలా అని నిత్యం అక్కడ ఈ పండుగలు జరగవు. ఏడాదిలో ఐదు రోజులు మాత్రమే ఈ వేడుకలు జరుగుతుంటాయి. రొట్టెలు తింటే కోరిన కోర్కెలు తీరుతాయా... అంటే అవుననే అంటున్నారు అక్కడి భక్తులు. కోరిన కోరికలు కోరుకుంటూ రొట్టెలు పట్టుకునే వారు కొందరైతే... కోరిక తీరిన తర్వాత రొట్టె వదిలే వారు మరి కొందరు. ఇదేదో ఒక ప్రాంతానికి పరిమితమైన రొట్టెల పండుగ కాదు.. దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు రొట్టెలు పట్టుకునేందుకు అక్కడికి వస్తారు. భక్తివిశ్వాలతో అమరవీరుల సమాధులను దర్శించుకొని రొట్టెలు మార్చుకుంటారు.మత సామరస్యానికి, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్న రొట్టెల పండుగ నెల్లూరు లో ఈనెల 29 నుంచి ఐదు రోజుల పాటు జరగనుంది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే ఈ పండుగ విశేషాలు ఓ సారి చూద్దాం. మతసామరస్యానికి ప్రతీకగా అయిన ఆ పండుగను.. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించింది. ఒక్క ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి ఆ మతం, ఈ మతం అని తేడా లేకుండా అందరూ కలిసి వచ్చి కోరిన కోర్కెల రొట్టెలు మార్చుకోవడం శతాబ్దాల కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. చదువు రొట్టె, ఆరోగ్య రొట్టె, సంతాన రొట్టె, వివాహ రొట్టె ఇలా 12 రకాల కోర్కెలకు సంబంధించిన రొట్టెలు అక్కడ ప్రత్యేకం. గతంలో ఆస్కార్ విజేత ఏఆర్ రెహ్మాన్ కూడా రొట్టెల పండగకి వచ్చి రొట్టెలు స్వీకరించారు. ఈ ఏడాది భారీ ఏర్పాట్లతో అత్యంత వేడుకగా రొట్టెల పండగ నిర్వహించాలని అధికారులు సిద్ధమయ్యారు. ఏటికేడు భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రులు కూడా రొట్టెల పండుగకు వచ్చి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రొట్టెలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి.అసలు నెల్లూరులో రొట్టెల పండుగ ఎలా మొదలైంది ఆర్కాటు నవాబుల కాలంలో నెల్లూరు చెరువు వద్ద రజకులు బట్టలు ఉతికేవారు. ఈ సందర్భంలో రజకులైన భార్యాభర్తలు చెరువులో బట్టలు ఉతుకుతుండగా పొద్దు పోవడంతో అక్కడే నిద్రపోయారు. రజకుని భార్యకు అక్కడ సమాధులైన బారాషహీద్‌లు కలలోకి వచ్చి ఆర్కాటు నవాబు భార్య అనారోగ్యంతో బాధపడుతుంది.. సమాధుల పక్కనున్న మట్టిని తీసుకెళ్ళి ఆమె నుదిటిపై రాస్తే కోలుకుంటుందని చెప్పారు. ఉదయాన్నే భార్యభర్తలిద్దరు గ్రామంలోకి వెళుతుండగా ఆర్కాటు నవాబు భార్య అనారోగ్యంతో బాధపడుతుంది ఆమెకు సరైన వైద్యం చేసినవారికి విలువైన బహుమతి అందజేస్తామని దండోరా వేయిస్తుంటారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రజకుడు తన భార్యకు కలలో వచ్చిన విషయాన్ని నవాబు ఆస్థానంలో వున్న వారికి వివరిస్తారు. దీంతో రాజు తన అనుచరులను నెల్లూరు చెరువు వద్దకు పంపి అక్కడి మట్టిని తెప్పించుకుని రాజు భార్య నుదుటిపై పూస్తారు. వెంటనే ఆమె ఆరోగ్యం కుదుట పడుతుంది. దీంతో ఆ రాజుకు పట్టలేనంత సంతోషంతో తన భార్యతో కలసి నెల్లూరులోని స్వర్ణాల చెరువు సమీపంలోని సమాధుల వద్దకు వచ్చి బారాషహీదులకు ప్రార్థనలు చేసి, తమ వెంట తెచ్చుకున్న రొట్టెల్లో కొన్నింటిని అక్కడి వారికి పంచుతారు. అలా అప్పటి నుండి ఈ రోజు వరకు ఆ ఆనవాయితీ ప్రకారం రొట్టెల మార్పు జరుగుతోంది. కోర్కెలు తీరిన వారు రొట్టెలను తీసుకుని దర్గా వద్ద చెరువులో తడిపి మరొకరికి ఇవ్వడం, కోర్కెలు కోరుకునే వారు వాటిని తీసుకోవడం అప్పటి నుంచి ఆచారంగా వస్తుంది. ఇలా ఆ విధంగా రొట్టెలు మార్పు చేసుకోవడం అది రొట్టెల పండుగగా మారింది. అప్పట్లో ఈ పండుగను మొహరం నెలలో ఒక్కరోజు మాత్రమే జరుపుకునేవారు. కాలగమనంలో భక్తుల తాకిడి ఎక్కువై కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొంటుండంతో ఈ పండుగను ఐదు రోజులు జరుపుకుంటున్నారు. నెల్లూరు నగరంలోని భారా షాహిద్ దర్గా రొట్టెల పండగ కోసం సిద్ధం అయింది. ఐదు రోజుల పాటు జరిగే ఈ రొట్టెల పండగకు సంబంధించి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వర్ణాల చెరువును విద్యుద్దీపాలతో అలంకరించారు. దర్గా ఆవరణలోని స్వర్ణాల చెరువులో స్నానం చేసి.. రొట్టె తీసుకుంటే కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఐదు రోజుల పాటు అంటే ఆగస్టు మూడవ తేదీ వరకు ఈ పండుగ జరగనుంది. ఈ వేడుకలో గంధ మహోత్సవం ఎంతో ప్రత్యేకమైంది. కోటమిట్ట అమీనియా మసీదు నుంచి 12 బిందెల్లో గంధాన్ని కలుపుకొని ఊరేగింపుగా తీసుకొస్తారు. అక్కడ కడప దర్గా పీఠాధిపతి చేతుల మీదుగా ప్రార్థనలతో అమరవీరుల సమాధులకు లేపనం చేస్తారు.. దీన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారు.

## 30న పీఎస్ఎల్వీ సీ56 ప్రయోగం

**జయభేరి, నెల్లూరు :**

భారత అంతరిక్షణ పరిశోధ సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 30వ తేదీ ఆదివారం రోజున పీఎస్ఎల్వీ సీ56 ప్రయోగాన్ని చేపట్టేందుకు ఇస్రో అన్ని సిద్ధం చేసింది. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ఈ నెల 30వ తేదీ ఆదివారం రోజున ఉదయం 6.30 గంటలకు ఈ ప్రయోగం చేపట్టనుంది. పీఎస్ఎల్వీ సీ56 మిషన్.. పీఎస్ఎల్వీ సీ55 మాదిరిగానే కోర్‌ఎలోన్ మోడ్ లో కాన్ఫిగర్ చేశారు. DSSAR ఉపగ్రహాన్ని ప్రాథమిక పేలోడ్ గా పీఎస్ఎల్వీ సీ56 తీసుకెళ్లనుంది. సింగపూర్ డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (DSTA), ST ఇంజినీరింగ్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ఈ 360 కిలోల DSSAR ఉపగ్రహాన్ని 5 డిగ్రీల వంపులో... 535 కిలోమీటర్ల ఎత్తులో నియర్‌ఈక్వటోరియల్ ఆర్బిట్ (NEO) లోకి ప్రవేశపెట్టనుంది. DSSAR ఉపగ్రహం ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్(IAI) అభివృద్ధి చేసిన సింథటిక్ అపెర్చర్ రాడార పేలోడ్ తో అమర్చారు. ఈ అధునాతన సాంకేతికత ద్వారా DSSAR అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ పగలైనా, రాత్రయినా కవరేజీని అందించే సామర్థ్యం కలిగి ఉంటుంది. పూర్తిస్థాయి పోలారిమెట్రీ వద్ద 1mరిజల్యూషన్ తో ఇమేజింగ్ ఇవ్వగలగు.ఈ ఉపగ్రహం తన కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత సింగపూర్ ప్రభుత్వంలోని వివిధ ఏజెన్సీల ఉపగ్రహ చిత్రాల అవసరాలకు DSSAR తన సపోర్ట్ ను అందిస్తుంది. అలాగే ST ఇంజినీరింగ్ వారి వాణిజ్య వినియోగదారుల కోసం మల్టీమోడల్, హైయ్యర్ రెస్పాన్సివ్‌నెస్ చిత్రాల కోసం జియోస్పేషియల్ సేవల కోసం




ఈ ఉపగ్రహాన్ని వాడుకోనున్నారు. DSSAR శాటిలైట్ తో పాటు మరో ఆరు ఉపగ్రహాలను నింగిలోకి పంపనున్నట్లు ఇస్రో ప్రకటించింది. టెక్నాలజీ డెమాన్ స్ట్రేషన్ మైక్రో శాటిలైట్ వెలాక్స్ AM, ఎక్స్‌పెరిమెంటల్ శాటిలైట్ ARCADE, 3U నానోశాటిలైట్ స్కూబ్ 2, IoT కనెక్టివిటీ నానోశాటిలైట్ నూలయన్, గెలాసియా 2, ORB12 స్ట్రైడర్ శాటిలైట్లను కూడా రోదసిలోకి పంపనుంది ఇస్రో. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్3 విజయవంతంగా ఐదు దశలను పూర్తి చేసుకుని చంద్రుడివైపు వేగంగా కదులుతోంది. భూగురుత్వాకర్షణ పరిధిని దాటి ప్రస్తుతం చంద్రుడి వైపు సాగుతోంది చంద్రయాన్3. తదుపరి చేపట్టే దశలు అన్నీ చంద్రయాన్3 ప్రయోగానికి కీలకమే అని ఇస్రో అధికారులు చెబుతున్నారు. ఆగస్టు 1, 2023 నిర్దేశించిన ప్రకారం చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించనుంది. ఈ మిషన్ లో ఇది కీలకమైన దశగా ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ దశలో చంద్రయాన్3 చంద్రుని గురుత్వాకర్షణ పరిధిలోని కక్ష్యలోకి చేరుతుంది. క్రమంగా ఈ కక్ష్య పరిధిని కుదించుకుంటూ చంద్రునికి దగ్గరగా వెళ్తుంది.

1,27,609 కి.మీ x 236 కి.మీ కక్ష్యను చేరుకుని క్రమంగా చంద్రునికి దగ్గరగా వెళ్తుంది. అలా ఆగస్టు చివరి నాటికి చంద్రునికి 30 కిలోమీటర్ల దగ్గరి వరకు వెళ్తుంది. ఆ సమయానికి చంద్రయాన్3 చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతానికి చేరుకున్న తర్వాత అసలు సిసలు పరీక్ష ప్రారంభం అవుతుంది. చంద్రయాన్3 రోవర్ సాఫ్ట్ ల్యాండింగ్ అవుతుంది. అనుకున్నది అనుకున్నట్లు ప్రణాళికబద్ధంగా జరిగితే చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన నాల్గో దేశంగా భారత్ నిలవనుంది. రష్యా, అమెరికా, చైనా తర్వాత చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన 4వ దేశంగా భారత్ రికార్డులకెక్కనుంది.

## విజయసాయిరెడ్డికి పూర్వ వైభవం

**జయభేరి, విజయవాడ :**

విజయసాయిరెడ్డి రెండేళ్ల కిందటి వరకూ వైఎస్ఆర్‌సీపీలో నెంబర్ 2 స్థానంలో ఉండేవారు. తర్వాత ఏం జరిగిందో కానీ ఢిల్లీకే పరిమితమవుతూ వస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు, బాపట్ల, నరసరావుపేట జిల్లాలకి రీజనల్ కోఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డిని జగన్ నియమించినట్లుగా వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ప్రకటన చేయలేదు కానీ..ఆయన మత్రం పనిలోకి దిగిపోయారని అంటున్నారు. ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు, బాపట్ల, నరసరావుపేట జిల్లాలకి రీజనల్ కోఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డికి జగన్ బాధ్యతలిచ్చినట్లుగా చెబుతున్నారు. నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ పదవికి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్ ఇటీవలడి రాజీనామా చేశారు. ప్రకాశం జిల్లా బాధ్యతలు బాలినేనికి అప్పగించకుండా విజయసాయిరెడ్డిని వైసీపీ అధిష్టానం తెరపైకి తెచ్చింది. వైఎస్ జగన్ నమ్మే అతి కొద్ది మందిలో సాయిరెడ్డి మొదటి వ్యక్తని వైసీపీ శ్రేణులు చెప్పుకుంటూ ఉంటాయి. పైగా రాజకీయంగా ఆయనకు అపార అనుభవమే ఉందని.. వీటన్నింటికీ మించి ఎలాంటి నేతల మధ్య విబేధాలున్నా ఒకట్రెండు సమావేశాలతోనే కలిపేసే సత్తా కలిగి ఉన్న నేత అని అభిమానులు, అనుచరులు చెప్పుకుంటూ ఉంటారు. అందుకే



ఈయనైతేనే ఈ మూడు జిల్లాల ఎమ్మెల్యేలు, ద్వితియ శ్రేణి నేతలను సమన్వయం చేసుకోగలరని సీఎం విశ్వసిస్తున్నారట. ఇప్పుడు సాయిరెడ్డిని పక్కకు తప్పించి చెవిరెడ్డికి బాధ్యతలు అప్పగించినట్లయిందన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియా బాధ్యతల నుంచి సాయిరెడ్డిని తప్పించి సజ్జల కుమారుడికి ఇచ్చేశారు. ఇప్పుడు ఈ కోఆర్డినేటర్ పదవి నుంచి సాయరెడ్డిని పక్కన పెట్టడం వైఎస్ఆర్‌సీపీలో కూడా చర్చనీయాంశం అవుతోంది. ప్రస్తుతం విజయసాయిరెడ్డికి పార్టీలో ఎలాంటి బాధ్యతలు లేవు. ఇప్పుడు హఠాత్తుగా ఆయనకు నాలుగు జిల్లాల పదవి ఇచ్చారు. ఇటీవల విజయసాయిరెడ్డిని సీఎం జగన్ పిలిపించుకుని గతంలో మాదిరిగా పార్టీ బాధ్యతలు తీసుకోవాలని సూచించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో విజయసాయిరెడ్డి అవసరం పార్టీకి ఎంతో అవసరం ఉందని జగన్ గుర్తించారని అంటున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ పదవులు ఎవరెవరికి ఇవ్వాలనే విషయమై విజయసాయిరెడ్డి కసరత్తు ప్రారంభించారని అంటన్నారు.

## సోషల్ వార్ కు సిద్ధమౌతున్న జనసేన

**జయభేరి, విజయవాడ :**

జగనన్న కాలనీల ముసుగులో వైసీపీ ప్రభుత్వం అతి పెద్ద కుంభకోణానికి పాల్పడుతుందని జనసేన పార్టీ ఆరోపించింది.ఈ అంశాన్ని సోషల్ మీడియా వేదికగా జనంలోకి తీసుకువెళ్లాలని నిర్ణయించింది. వర్షాకాలంలో జగనన్న కాలనీల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితులు కళ్లకు కట్టే విధంగా రాష్ట్రవ్యాప్త జనసేన పార్టీ క్యాంపెయిన్ కు పిలుపునిచ్చింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 10 గంటల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలంతా తమతమ ప్రాంతాల్లోని జగనన్న కాలనీలు సందర్శించి అక్కడ పరిస్థితులను ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి తెలియచేయాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గురువారం పార్టీ పీఏసీ సభ్యులు, ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జిలు, వీర మహిళ ప్రాంతీయ కమిటీ సభ్యులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... జగనన్న కాలనీల పేరిట జరిగిన అతిపెద్ద కుంభకోణాన్ని విజయనగరం జిల్లా గుంకలాం ప్రాంతం నుంచి పవన్ కల్యాణ్ బయటపెట్టగా అద్భుతమైన డిజిటల్ క్యాంపెయిన్ ద్వారా పార్టీ తరపున రాష్ట్ర ప్రజలకు గతేడాది తెలియచెప్పే ప్రయత్నం చేశాం. నిరుపయోగంగా ఉన్న భూములు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ




పార్టీ నాయకులు, శాసనసభ్యులు ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మేసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో చెరువుల్ని సైతం ఆక్రమించేసి ప్రభుత్వానికి ఇళ్ల స్థలాలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు అని నాదెండ్ల మనోహర్ ఆరోపించారు.జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన పేరుతో రూ.89వేల కోట్లు ఖర్చు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందని మరి ఆ కోట్లు ఎటు పోతున్నాయి అని నాదెండ్ల మనోహర్ నిలదీశారు. ప్రతి జగనన్న కాలనీలో రోడ్లు, వీధి దీపాలు, పార్కులు, గ్రంథాలయం, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తామని రకరకాల కబుర్లు చెప్పి ప్రజల్ని సీఎం వైఎస్ జగన్ మోసం చేస్తున్నారని ఆరోపించారు. మౌలిక వసతుల పేరిట చేసిన మోసాన్ని ప్రజలకు తెలియచేద్దాం అని పిలుపునిచ్చారు. రోడ్ల నిర్మాణం కూడా స్థానిక ఎమ్మెల్యేల అనుచరులకే పరిమితం అయ్యింది అని చెప్పుకొచ్చారు. కొన్ని ప్రాంతాల్లో లబ్దిదారుల నుంచి రోడ్ల నిర్మాణం పేరిట డబ్బులు వసూలు చేసి ఇబ్బందులు పెట్టడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి అని చెప్పుకొచ్చారు. ప్రజలు నిరసన తెలిపితే పట్టాలు రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడి మరీ బలవంతంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు అని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు శనివారం పార్టీ శ్రేణులంతా కలసి జగనన్న కాలనీలు సందర్శించి అక్కడ వాస్తవ పరిస్థితులు ఫోటోల రూపంలో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియచేయాలి అని పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు.



## మదనపల్లిలో రైతులకు కాసుల పంట

**జయభేరి, తిరుపతి :**

గత కొద్ది రోజులుగా దేశంలో టమోటా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.. సామాన్యులు, మధ్య తరగతి కుటుంబాలు టమోటాలను కొనాలంటేనే భయపడి పోతున్నారు. అయితే భూమిని నమ్ముకున్న రైతుకి అనూహ్య రీతిలో అదృష్టం వరించింది.. టమోటాల పంట సాగు చేసిన ఓ రైతు మూడు కోట్ల రూపాయలను సంపాదించాడు. వ్యవసాయంపై పెట్టుబడి ఎంతో మంది రైతులు వలసలు వెళ్ళిన ఘటనతో పాటుగా, ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటి సమయంలో చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు టమోటా పంటపై ఆధారపడి పంటను సాగు చేశారు. సీజన్ మొదట్లో టమోటాకు సరైన గిట్టు బాటు ధర లేక చాలా మంది రైతులు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఈ సమయంలో ఎవరూ ఊహించని రీతిలో దేశ వ్యాప్తంగా టమోటాకు అధిక రావడంతో ఒక్క సారిగా టమోటా రైతులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఇన్నాళ్ళ అప్పులు చేసి బ్రతుకు జీవుడా అంటూ బ్రతుకును సాగించిన రైతులు జోబులు గలగల మంటున్నాయి.టమాటా అధికంగా సాగయ్యే చిత్తూరు జిల్లా, సోమల మండలం, కరకమంద గ్రామానికి చెందిన చజ్రమౌళి రైతు కుటుంబం కేవలం నెల రోజుల వ్యవధిలోనే రూ.3 కోట్ల ఆదాయం పొందింది.. వేసవి అనంతరం వచ్చే పంటకు మంచి ధర వస్తుందని గుర్తించిన ఆ కుటుంబం పలు మార్లు టమోటా పంట నష్టాలు రుచి చూసిన పట్టు విడవకుండా తిరిగి అదే పంటను ఎన్నుకున్నారు.. ఏప్రిల్ లో మొక్కలు నాటి జూన్ నాటికి దిగుబడి ప్రారంభమయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో సాహూ రకం టమాటా మొక్కలు 22 ఎకరాల్లో నాటారు. కట్టెసాగు విధానంలో మల్చింగ్, సూక్ష్మ సేద్య పద్ధతులు పాటించారు.జూన్ చివరిలో దిగుబడి మొదలైంది. దిగుబడిని జిల్లాకు దగ్గరగా ఉండే కర్ణాటకలోని కోలార్ మార్కెట్ విక్రయించారు.. వేలం పాటలో 15 కిలోల పెట్టె ధర రూ. వెయ్యి నుంచి రూ. 1500 మధ్య పలికింది.. ఇప్పటి వరకు 40వేల పెట్టెలు విక్రయించగా రూ.4 కోట్లు ఆదాయం వచ్చినట్లు రైతు తెలిపారు. అందులో ఎకరాకు రూ.3 లక్షల చొప్పున పెట్టుబడి 22 ఎకరాలకు రూ.70 లక్షలు, కమీషన్ రూ.20 లక్షలు, రవాణా ఖర్చులు రూ. 10 లక్షలు పోనూ రూ.3 కోట్ల ఆదాయం వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు..గత కొద్ది రోజులుగా దేశ వ్యాప్తంగా టమోటా ధరలు మండుతున్నాయి.. దేశంలో అతిపెద్ద టమోటా మార్కెట్ లో ఒక్కటైనా మదనపల్లె టమోటా మార్కెట్ యార్డ్ నుండి వివిధ రాష్ట్రాలకు ప్రతి నిత్యం టమోటా ఎగుమతి జరుగుతుంటుంది.. ఒక్కసారిగా టమోటా ధర అధికంగా కావడంతో టమోటా రైతులు సంతోషానికి హద్దులు లేవు.. ఇక శుక్రవారం రోజులన మదనపల్లె మార్కెట్ యార్డ్ లో కిలో టమోటా 165 రూపాయలుగా పలికింది.. మరో నెల రోజుల వరకూ టమోటా ధర ఇలానే కొనసాగే అవకాశం ఉందని చెబుతున్నారు.




## అసెంబ్లీకే ఎంపీల ఓటు

**జయభేరి, విజయవాడ :**

శ్రీకాకుళం నుంచి మొదలు పెడితే ఇటు తిరుపతి వరకూ కూడా ప్రస్తుతం లోక్‌సభ సభ్యులుగా కొనసాగుతున్న చాలామంది వైసీపీ ఎంపీలు అసెంబ్లీవైపే మక్కువ చూపుతున్నారు. రాజకీయంగా క్రియాశీలకంగా ఉండేందుకు ఎంపీ పదవి కన్నా, ఎమ్మెల్యే పదవే బెటరని వారు భావిస్తున్నారు. తమ పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు వెళ్లాలన్నా లోకల్ ఎమ్మెల్యే సహకారం తప్పనిసరి అవుతుందని వారి భావన. కొన్నిచోట్ల లోకల్ ఎమ్మెల్యేలతో పొసగడకపోవడం కూడా వారికి ఇబ్బందిగా మారిన సందర్భాలు ఉన్నాయి. ఖర్చులు ఎక్కువుగానే ఉంటున్నాయి. వీటికి బదులు ఎమ్మెల్యేగా పోటీచేస్తే చాలన్న ధోరణిలో కొందరి వ్యవహారం ఉంది.శ్రీకాకుళం ఎంపీగా పోటిచేసిన వైసీపీకి చెందిన దువ్వాడ శీను ప్రస్తుం ఎమ్మెల్సీగా ఉన్నారు. కొద్దిరోజుల క్రితం వరకూ టెక్కలి అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. టిక్కెట్టుకూడా ఆయనకు ఇస్తున్నట్టు జగన్ కార్యకర్తల సమావేశంలోకూడా చెప్పారు. ఈ మధ్య శీను భార్యను ఇన్ఛార్జిగా నియమించారు. ఏదిఏమైనా ఆయన కుటుంబం ఎంపీ పదవికన్నా.. ఎమ్మెల్యే పదవిపైనే ఆసక్తి చూపింది.ఇటు విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యన్నారాయణ కూడా ఎమ్మెల్యేగా పోటీచేయడానికి దాదాపు నిర్ణయం తీసుకున్నారు. దీనిపై పార్టీకూడా ఒక నిర్ణయానికి వచ్చినట్టే కనిపిస్తోంది. విశాఖ తూర్పునియోజకవర్గం నుంచి ఆయన పోటీచేయడానికి అన్నిరకాలుగా గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆ నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌ఛార్జిగా ఉన్న అక్కరమాని విజయనిర్మలను ఒప్పించడం ఇప్పుడు పార్టీకి సవాలుగా మారిందని వైసీపీ వర్గాలు చెప్తున్నాయి. ఎంవీవీకి ఎమ్మెల్యే టిక్కెట్టు ఇస్తే ఎంపీ అభ్యర్థిని టీడీపీ వెతుక్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న వెలగపూడి రామకృష్ణబాబుకు బ్రేక్ చెప్పాలన్నది వైసీపీ వ్యూహం.రాజమండ్రి లోక్‌సభ సభ్యుడు మార్గాని భరత్‌రాం కూడా ఎమ్మెల్యేవైపే మొగ్గుచూపారు. ఆయన్ను సిటీలో కూడా తిరగాలని కూడా అధినేత ఆదేశించారంట. ఇంతలోనే ఈ వ్యవహారం మళ్లీ మీమాంసలో పడినట్టు తెలుస్తోంది. మరికొద్దిరోజుల్లో దీనిపై స్పష్టత వస్తుంది. మొత్తమ్మీదకు ఎమ్మెల్యే పదవిపై మరో ఎంపీ మోజుపడినట్టే ఇక్కడ స్పష్టం అవుతోంది.బాపట్ల ఎంపీగా ఉన్న నందిగం సురేష్‌కూడా ఎమ్మెల్యేగా పోటీచేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. అందుబాటులో ఉన్న నియోజకవర్గాలపై సురేష్ కసరత్తు చేస్తున్నారు. ఇక నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీచేయడం ఖరారయ్యింది. ప్రస్తుతం నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి ఆయన్ని ఇన్‌ఛార్జిగా నియమించారు. పార్టీవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పార్టీనుంచి సస్పెండ్ చేశారు. ఇప్పుడు కోటంరెడ్డి టీడీపీలో చేరారు.అనంతపురం ఎంపీగా ఉన్న తలారి రంగయ్య, అలాగే హిందూపురం ఎంపీగా ఉన్న గోరంట్ల మాధవ్ కూడా ఎమ్మెల్యేలుగా పోటీ చేయడానికే ఆసక్తి చూపుతున్నారని ఆయా జిల్లాల్లోని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఎంపీ వద్దు.. ఎమ్మెల్యే ముద్దు అధికారపార్టీలో కొంతమంది ఎంపీల ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

ప్రభాత జయభేరి
jayabheridaily.com

## పోలాలలో ఇసుక మేటలు

**జయభేరి, ములుగు :**

ములుగు జిల్లాలో కురిసిన భారీ వర్షాలు గోదావరి పరీవాహక ప్రాంతాల రైతులకు కన్నీళ్లను మిగిల్చాయి. ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు వరదలు రావడంతో పంటలు నీట మునిగి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో రైతుల శ్రమ, పెట్టుబడి ఇసుకపాలైంది. పంట పరిశీలనకు వస్తున్న అధికారులకు పొలాలను చూపుతూ పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. జిల్లాలో భారీ వర్షాలకు వరదలు వచ్చి పొలాల్లో ఇసుక మేటలు వేయడం వల్ల భూములు వ్యవసాయానికి పనికివచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఒక్కో పొలంలో ఫీట్ నుంచి రెండున్నర ఫీట్ల వరకు ఇసుక మేటలు వేయడంతో పాటు మట్టి భారీగా చేరడం వల్ల పంటలు వేద్దామన్న రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని తొలగించాలన్న ఒక్కో రైతుకు ఎకరాకు 50వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు పెడితే తప్ప భూములు వ్యవసాయానికి పనికివచ్చే పరిస్థితి లేదు. పంట చేళ్ల పరిశీలనకు వచ్చిన అధికారులకు విజ్ఞప్తి చేయడంతో పాటు ఇసుక మేటలను తొలగించేందుకు సహకరించాలని కోరుతున్నారు. ఈ భూము లే తమకు ఆధారమని వ్యవసాయం తప్ప వేరే ప నులు తెలియవని ఇసుక త్వరగా తొలగించేందుకు సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు...

## మోరంచపల్లిలో అతలాకుతలం

**జయభేరి, భూపాలపల్లి :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం మోరంచ పల్లి గ్రామంలో మొరంచ వాగు పెను విషాదం మిగిల్చింది. అర్ధరాత్రి అందరు నిద్రిస్తుండగా సునామీలా దూసుకు వచ్చిన వరద ఉధృతికి గ్రామం ఒక్కసారిగా అతలాకుతలమైంది. ప్రస్తుతం మొరంచ వద్ద పూర్తిగా వరద ఉధృతి పూర్తిగా తగ్గింది. గ్రామంలో ఎటు చూసినా బాధిత ప్రజల ఆహాకారాలు కలిచి వేస్తున్నాయి. తమ తమ గృహాలకు చేరుకొని జరిగిన విధ్వంసానికి కన్నీరుమున్నీరు అవుతున్నారు. సుమారు 250కి పైగా నివాస గృహాలు ఉండే ఈ గ్రామంలో 600 మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వరదల వలన గ్రామానికి చెందిన నలుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారి ఆచూకీ ఇప్పటికీ తెలియ రాలేదు. వరదల్లో చిక్కుకున్న స్థానిక ప్రజలను బొట్ల ద్వారా రక్షించి గాంధీ నగర్, కర్కపల్లి ల వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి వసతి కల్పించారు. వరదల్లో చిక్కుకొని సుమారు 150 కి పైగా పశువులు మృత్యువాత పడ్డాయి. మరికొన్ని పశువులువరద తాకిడికి కొట్టుకుపోయాయి. నివాస గృహాలు ఎక్కడికక్కడ ధ్వంసం అయ్యాయి. ఇండ్లలో ఉండే గృహపకరణాలు, సామాగ్రి అన్ని కొట్టుకుపోయాయి. వరద ప్రభావంతో కుందయ్యపల్లి మొరంచ గ్రామాల మధ్య రహదారి పూర్తిగా ధ్వంసమైంది. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా వరద ప్రభావిత ప్రాంతానికి చేరుకొని పరిస్థితులు సమీక్షిస్తున్నారు.

## సుప్రీంకోర్టులో కవితకు ఊరట

**జయభేరి, న్యూఢిల్లీ :**

ఢిల్లీ లిక్కర్ కేసు వ్యవహారంలో భాగంగా గత మార్చి నెలలో ఎమ్మెల్సీ కవిత ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఈ విచారణకు నోటీసులు ఇచ్చిన విషయంలో ఓ మహిళను ఈడీ కార్యాలయానికి పిలిపించవచ్చా అనే దానిపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించగా, తాజాగా అత్యున్నత న్యాయస్థానం ఎమ్మెల్సీ కవిత పక్షాన నిలిచింది. ఈడీపై కవిత దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.విచారణ కోసం మహిళను ఈడీ కార్యాలయానికి పిలిపించవచ్చా లేదా అన్న అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మహిళను ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి పిలిపించి విచారించడానికి సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత పిటిషన్ దాఖలు చేయగా.. పిటిషన్ ను జస్టిస్ సంజయ్ కిషన్ కౌర్ ధర్మాసనం విచారణ చేసింది. కవిత పిటిషన్ ను పరిగణలోకి తీసుకుని.. ఆ పిటిషన్ పై ఆరు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఈడీని ఆదేశించింది. ఆ తర్వాత రెండు వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని కవితకు సూచించింది. కవిత తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహద్గీ వాదనలు వినిపించారు. విచారణకు తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచందర్ రావు కూడా హాజరు అయ్యారు.

## మల్కాజ్ గిరి ఎంపీ మిస్సింగ్

**జయభేరి, హైదరాబాద్ :**

మల్కాజ్‌గిరి ఎంపీ మిస్సింగ్.. 2020 వరదలు వచ్చినప్పుడు రాలేదు.. 2023లో వారం నుంచి వర్షాలు కురుస్తున్న రాలేదు.. మల్కాజ్‌గిరి ఎంపీ, తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కనబడుటం లేదని నియోజకవర్గంలో పోస్టలర్లు వెలువడటం హాట్ టాపిక్ గా మారింది. హైదరాబాద్ నగరంలో వరదలకు ప్రతి కుటుంబానికి 10వేలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు నిరసనలు చేస్తుంటే.. అసలు ఒక ఎంపీగా ఎప్పుడు అయినా నియోజవర్గానికి వచ్చారా..? అంటూ మల్కాజ్‌గిరి అంతటా రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూ పోస్టర్లు పెట్టడం ఆసక్తిగా మారింది.రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు.. హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. దీంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే, రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో ఉంటూ నియోజవర్గానికి రాకపోవడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు. అయితే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా విపక్షాలు విమర్శలు మాని ప్రజలకు సహాయం చెయ్యాలని కౌంటర్ ఇవ్వడం.. ఆ వెంటనే పోస్టర్లు వెలవడం పట్ల బిఆర్ఎస్ హస్తమే అయి ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఏది ఎలా ఉన్నా మా నాయకుడు కనపడటం లేదు.. అనే పోస్టర్లు వెలువడటం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు ఇంట్రెస్టింగ్ టాపింగ్ గా మారింది

## సీజనల్ వ్యాధులు షురూ

**జయభేరి, మెదక్ :**

వరసగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే సీజనల్ వ్యాధులు మొదలైయినాయి. మరో వైపు ఇదే వర్షలకు కొన్ని చోట్ల తాగే మంచి నీరు కలుషితం అవుతుండడంతో అస్వస్థతకు గురి అవుతున్నారు కొంతమంది. తాజాగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం బలవంతపూర్, దుంపలపల్లి గ్రామాల్లో మంచినీరు కలుషితం అవ్వడంతో రెండు గ్రామాల్లోని 50 మంది తీవ్ర అస్వస్థతకు గురైనారు. నిన్నటి నుండి వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడ్డారు.పరిస్థితి విషమంగా ఉన్నవారిని రాత్రి సిద్దపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు.. కాగా నేడు దుంపలపల్లి, బల్వంతపూర్ గ్రామాల్లో హెల్త్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు అధికారులు. మళ్ళీ ఏమైనా ప్రమాదం సంభవిస్తే ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేసారు. ఇప్పటికైతే అస్వస్థతకు గురైన వారు అందరూ సేఫ్ గానే ఉన్నారు అని వైద్యులు చెప్పారు..మరో వైపు సీజనల్ వ్యాధులు,కలుషిత నీరు వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ఉండడానికి మంచినీటిని వేడి చేసి తాగాలని సూచిస్తున్నారు వైద్యులు. గర్భిణీపై ఇంటి పైకప్పు కూలడంతో కడుపులోని గర్భస్థ శిశువు మృత్యువాత పడింది. తల్లి పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషాదఘటన మెదక్‌లోని మిలట్రీ కాలనీలో బుధవారం (జులై 27) చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే..మెదక్‌లో నివాసం ఉంటోన్న మహ్మద్ సర్వర్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతని రెండో కూతురు యాస్మిన్ సుల్తానా ఇటీవల తొలికాన్పు కోసం పుట్టింటికి వచ్చింది. మరో 15 రోజుల్లో ఆమెకు ప్రసవం కావాల్సి ఉండగా ఇంతలో ఘోర ప్రమాదం జరిగింది. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో భారీ వర్షాలకు ఇంటి పైకప్పు నానిపోయి ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో గర్భిణీ యాస్మిన్, ఆమె తల్లి తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు హుటాహుటీనా వారిని మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి యాస్మిన్ కడుపులో గర్భస్థ శిశువు మృతి చెందినట్లు గుర్తించారు. ఆమెను వెంటనే హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఇక యాస్మిన్ తల్లి చాంద్ సుల్తానా మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సుల్తానా కుటుంబాన్ని పరామర్శించి లక్ష రూపాయలు అందించారు.

# 3 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**జయభేరి, హైదరాబాద్ :**




తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వచ్చే నెల 3వ తారీఖు నుంచి ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత నిర్వహించే బీఏసీ మీటింగ్ లో ఎన్ని రోజుల పాటు అసెంబ్లీ సెషన్స్ నిర్వహించాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. భారీ వర్షాలతో పాటు రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని టార్గెట్ చేసేందుకు విపక్షాలు అస్త్రాలను సిద్ధం చేసుకోంటున్నాయి. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పాదయాత్ర చేశారు. పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై ఆయన అసెంబ్లీ సెషన్స్ లో ప్రస్తావించే ఛాన్స్ ఉంది.మరో వైపు రాష్ట్ర ప్రజల సమస్యలపై కేసీఆర్ సర్కార్ పై కమలం పార్టీ కూడా సభలో ప్రశ్నలను సంధించేందుకు అవకాశం ఉంది. ఇంకో వైపు తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక బిల్లులను కూడా ప్రవేశ పెట్టే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, కేసీఆర్ ప్రభుత్వానికి ఇదే చివరి అసెంబ్లీ సమావేశాలు. ఎందుకంటే.. ఈ ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఈ అసెంబ్లీ సెషన్స్ ను అధికార, విపక్షాలు సీరియస్ గా తీసుకొనే ఛాన్స్ ఉందని పొలిటికల్ విశ్లేషకులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చే అంశంతో పాటు భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులపై విపక్షాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ఛాన్స్ ఉండగా..మరో వైపు విపక్షాలకు ప్రభుత్వం కూడా కౌంటర్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. భారీ వర్షాల కారణంగా ప్రభుత్వం ఏ రకమైన కార్యక్రమాలను చేపట్టిందో వివరించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇక, చూడాలి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఏ విధంగా కొనసాగుతాయి అనేది.

**31న కేబినెట్ భేటీ**

తెలంగాణ రాష్ట్రానికి వర్షాలు అతలాకుతలం చేశాయి. ఈనేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నెల 31న తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వ్యవసాయ రంగం, ముంపు ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. భారీ వర్షాలతో పాటు ముప్పైకి పైగా అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు జిల్లాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. చాలా జిల్లాల్లో పంట నష్టం కూడా జరిగింది.ఈ అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్థిక సాయం, ఇతర అంశాలపై కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గం చర్చించనుంది. రాష్ట్రంలో వరదల కారణంగా జరిగిన నష్టంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతుల గురించి సమాచారం చర్చించబడుతుంది. రోడ్ల పునరుద్ధరణ చర్యలపై కూడా సమావేశంలో చర్చించనున్నారు. ఆర్టీసీ సంస్థకు సంబంధించిన అంశాలపై కేబినెట్ చర్చించే అవకాశం ఉంది. ఆర్టీసీ ఉద్యోగుల జీతాల పెంపు తదితర అంశాలపై చర్చించనున్నారు.గత రెండు రోజులుగా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు అన్ని రికార్డులను బద్దలు కొట్టాయి. శుక్రవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. ముందుజాగ్రత్త చర్యగా ఈరోజు అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రంలో 8 మంది చనిపోయారు. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు ముగిసిన 24 గంటల వ్యవధిలో ములుగు జిల్లాలో 649.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది తెలంగాణ రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా అత్యధికంగా 24 గంటల వర్షపాతం రికార్డును బద్దలు కొట్టింది. తెలంగాణ రాష్ట్రం ఇదే కాలంలో సగటు వర్షపాతం 97.7 మిల్లీమీటర్లు కురిసింది, ఇది మునుపటి ఆల్ టైమ్ రికార్డును బద్దలు కొట్టింది

# హైదరాబాద్ లో మొహరం ఆంక్షలు

**జయభేరి, హైదరాబాద్ :**



హైదరాబాద్ పోలీసులు జులై 29వ తేదీ శనివారం రోజు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. మొహరం పండుగ సందర్భంగా నిర్వహించనున్న అశురా ఊరేగింపుకు ముందు పాతబస్తీలో ఎలాంటి ట్రాఫిక్ ఉండకుండా చూసేందుకు పోలీసులు సన్నద్ధం అయ్యారు. శనివారం రోజు మధ్యాహ్నం 12:00 గంటల నుంచి రాత్రి 10:00 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. సునర్‌గల్లి 'టి' జంక్షన్‌లో బీబీ కా అలావా వైపు వాహనాల రాకపోకలను అనుమతించరు. ఈ వాహనాలను దబీర్ పురా దర్వాజా, గంగా నగర్ నాలా, యాకుత్‌పురా వైపు మళ్లిస్తారు. షేక్ ఫైజ్ కమాన్ వైపు కూడా వాహనాలను అనుమతించరు. జబ్బార్ హోటల్ వద్ద దబీర్ పురా దర్వాజా లేదా చంచల్‌గూడ వైపు వాహనాలను పంపిస్తారు. ఈతేబార్ చౌక్ నుంచి వచ్చే వాహనాలు ఎథెబార్ చౌక్ వద్ద బడా బజార్ వైపు వెళ్లే మార్గాలను బ్లాక్ చేస్తూ కోట్లా అలీజా లేదా పురానా హవేలీ వైపు మళ్లిస్తారు. ఊరేగింపు గంగా నగర్ నాలా, యాకుత్‌పురాకు చేరుకున్నప్పుడు, ఎతేబార్ చౌక్ వైపు రోడ్లను బ్లాక్ చేస్తారు. పురాణి హవేలీ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను చట్టా బజార్, దబీర్‌పురా లేదాఎస్జే రోటరీ వైపు మళ్లిస్తారు. మొఘల్‌పురా, వోల్టా హోటల్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను బీబీ బజార్ X రోడ్‌లో పారిస్ కేఫ్ లేదా తలాబ్ కట్టా వైపు మళ్లిస్తారు. ఊరేగింపు ఎతేబార్ చౌక్‌కు చేరుకున్నప్పుడు, మిట్టికాషేర్ మరియు మదీనా నుంచి ట్రాఫిక్‌ను గుల్జార్ హౌస్ వద్ద మదీనా లేదా మిట్టికాషేర్ వైపు మళ్లిస్తారు. ఊరేగింపు కోట్లా అలీజాకు చేరుకున్నప్పుడు, మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను చౌక్ మైదాన్ ఖాన్ వైపు అనుమతించరు, హఫీజ్ డంకా మసీదు వద్ద పారిస్ కేఫ్ లేదా బీబీ బజార్ వైపు మళ్లిస్తారు. ఊరేగింపు చార్మినార్‌కు చేరుకోగానే గుల్జార్ హౌస్ వైపు ట్రాఫిక్‌ను అనుమతించరు. షక్కర్‌కోట్ నుంచి ట్రాఫిక్ మిట్టికాషేర్ జంక్షన్ వద్ద ఘూన్సీ బజార్ లేదా చెలాపురా వైపు మళ్లించనున్నారు. ట్రాఫిక్ ఎతేబార్ చౌక్ వద్ద కోట్ల అలీజా లేదా పురానీ హవేలీ వైపు మళ్లించనున్నారు. నయాపూల్ నుంచి ట్రాఫిక్ మదీనా ఎక్స్ రోడ్ వద్ద సిటీ కాలేజీ వైపు మళ్లించనున్నారు. ఊరేగింపు మీరాలం మండికి చేరుకున్నప్పుడు, చాదర్‌ఘాట్ రోటరీ, నూర్ఖాన్ బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, శివాజీ బ్రిడ్జ్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను పురానీ హవేలీ వైపు అనుమతించరు. అలాగే సాలార్ జంగ్ రోటరీ వద్ద నయాపూల్, శివాజీ బ్రిడ్జ్ మరియు నూర్ఖాన్ బజార్ వైపు మళ్లిస్తారు. ఊరేగింపు అలవా సర్తూక్‌కు చేరుకునేటప్పుడు, చాదర్‌ఘాట్ రోటరీ నుండి వచ్చే ట్రాఫిక్‌ను కాలీ ఖబర్ వైపు అనుమతించరు. దానిని చాదర్‌ఘాట్ రోటరీ వద్ద రంగ మహల్ లేదా కోటి వైపు చాదర్‌ఘాట్ వంతెన మీదుగా మళ్లిస్తారు. గౌలిగూడ లేదా అఫ్జల్‌గంజ్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను సాలార్ జంగ్/శివాజీ బ్రిడ్జ్ వైపు అనుమతించరు. సాలార్ జంగ్/శివాజీ బ్రిడ్జ్ ప్రవేశద్వారం వద్ద గౌలిగూడ వైపు మళ్లిస్తారు. ఊరేగింపు అలవా సర్టౌక్‌కు చేరుకున్నప్పుడు, SJ రోటరీ వైపు ట్రాఫిక్ నయాపూల్ వద్ద మదీనా వైపు మళ్లిస్తారు.

**బస్సులకు ట్రాఫిక్ ఆంక్షలు:**

జిల్లాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులపై ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆంక్షాలు విధించారు. ఈ సమయాల్లో వచ్చే బస్సులు రంగ్ మహల్, అఫ్జల్ గంజ్ వైపు నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు నిర్దేశించారు. మొహర్రం ఊరేగింపు ముగిసే వరకు బస్సులను కాళికాబర్, మీరాలం మండి రహదారి వైపు అనుమతించరు.

# గ్రేటర్ హైదరాబాద్ ఆఫీసు ఎదుట కాంగ్రెస్ ధర్నా

**జయభేరి, హైదరాబాద్ :**



హైదరాబాద్‌లో వరదలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆందోళనకు దిగారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వర్షాలు, వరదలు ఎదుర్కోవడంలో ప్రభుత్వం వైఫల్యానికి నిరసనగా కాంగ్రెస్ ధర్నాకు పిలుపునిచ్చింది. జీహెచ్ఎంసీ కార్యాలయం దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కార్యాలయంలోకి ఎవరినీ అనుమతించడంలేదు. గన్‌పార్కు కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేతలందరూ జీహెచ్ఎంసీ కార్యాలయం దగ్గర ధర్నాకుదిగారు. ఆఫీసు ముందు బైఠాయించి అధికారుల తీరుకు వ్యతిరేకంగా ధర్నాకు దిగారు హైదరాబాద్‌ను విశ్వ నగరంగా తయారు చేస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారని, విశ్వనగరం కాదుకదా.. ఇప్పుడు చెత్తనగరంగా తయారు చేశారని వారంతా ప్లకార్డులు ప్రదర్శించారు. నగరాన్ని కాపాడాల్సిన అవసరముందన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ఇబ్బందులు పడుతున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం రూ. 10వేల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యేలు, మంత్రులు ఏం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. నాలాల పూడిక తీయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నేత వీహెచ్ గ్రేటర్ కార్యాలయం లిఫ్ట్ దగ్గరకు వెళ్లి ధర్నా చేశారు. వారందర్నీ పోలీసులుబలవంతంగా తరలించారు. హైదరాబాద్ చుట్టూ దాదాపుగా పది రోజుల పాటు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో బస్తీలు, పలు కాలనీలు.. నీటితో మునిగిపోయాయి. డ్రైనేజీ వ్యవస్థకు సైతం సమస్యలు ఏర్పడటంతో.. నీరు బయటకు వెళ్లే మార్గం కనిపించక.. వారం, పదిరోజుల నుంచి కొన్ని కాలనీలు నీళ్లలోనే ఉంటున్నాయి. అలాంటి చోట్ల మంచి నీటి సరఫరా కూడా ఇబ్బందికరంగా మారింది. ఈ కారణాలతో ప్రభుత్వం.. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ అధికారులు సక్రమంగా పని చేయడం లేదని ధర్నాకు దిగారు. గతంలో వరదలు వచ్చినప్పుడు ఇంటికి రూ. పది వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించారని.. ఇప్పుడు రూ. ఇరవై వేలు ప్రకటించాలని.. కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ముంపునకు గురైన కాలనీల్లో నష్టపరిహారం అంచనా వేసి.. ప్రజల్ని ఆదుకోవాలంటున్నారు.

ప్రజల దగ్గర పన్నులు వసూలు చేసి కనీసం నాలాలను కూడా మెరుగు పర్చకుండా.. ప్రజల్ని ముంచుతున్నారని వారు మండిపడుతున్నారు.. నాలాల్లో సిల్ట్ తీసే కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయకపోవడం వల్ల.. ఎక్కువ శాతం నాలాల్లో బ్లాకేజీ ఉందని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించే వరకూ ఆందోళన చేస్తూనే ఉంటామని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు.

## సెలవులు బంద్.. ఉద్యోగాల్లో చేరండి

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. అన్ని జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చాలా చోట్ల ప్రజలు వరదల్లో చిక్కుకున్నారు. ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరింది. తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. వరదల కారణంగా రాష్ట్రంలో ప్రతికూల వాతావరణం నెలకొంది. దీంతో ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తూ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ గడాల శ్రీనివాసరావు అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఉద్యోగులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయవద్దని ఆదేశించారు. మరెవరైనా.. ఉద్యోగులు సెలవులో ఉంటే వెంటనే విధుల్లో చేరాలన్నారు. వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు ప్రధాన కార్యాలయంలోనే ఉండి విధులు నిర్వహించేలా అధికారులు చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరదల వల్ల రోగాలు వచ్చే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.తెలంగాణలో అసాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో రేపు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. న్నాయని అన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.



## వాన తగ్గింది.. బురద మిగిలింది

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చాలా చోట్ల ప్రజలు వరదల్లో చిక్కుకున్నారు. ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరింది. అయితే గత వారం రోజులుగా కురుస్తున్న వానలు ఈరోజు కాస్త తగ్గుముఖం పట్టాయి. పునరావాస కేంద్రాలు, కొండలపైకి, ఇళ్లపై వెళ్లి తల దాచుకున్న బాధితులు ఇళ్లను చూసి చలించిపోయారు. వారం రోజులుగా వరద నీటిలో చాలా ఇళ్లు కొట్టుకుపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోయి గోడలు నిలిచిపోయాయి. రోడ్లపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ఒండ్రుమట్టి పేరుకుపోయి చెట్లు కూలిపోవడంతో రోడ్లు దెబ్బతిన్నాయి. మిగిలిన ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రతి గ్రామంలో రోడ్లు ధ్వంసమై బతకలేని పరిస్థితి నెలకొంది. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఇళ్లలోని సామాన్లు కొట్టుకుపోవడంతో భయానక వాతావరణం నెలకొంది. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వరద తగ్గుముఖం పట్టడంతో గ్రామాల ప్రజలు స్వగ్రామాలకు చేరుకుని ఇళ్లను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. విద్యుత్తు సరఫరా ఉన్నా మోటార్లు నీటిలో తడిసి పనిచేయడం లేదని వాపోతున్నారు. ఇంట్లోని విలువైన వస్తువులు తడిసి పనికిరాని స్థితిలో ఉన్నాయని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వరద ప్రవాహం తగ్గుముఖం పట్టినప్పటికీ కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా పునరుద్ధరణ కాలేదని, ఆస్తినష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుని జీవనం సాగిస్తున్న మాకు ఇలాంటి ఆపద వస్తే అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని వాపోతున్నారు. ఇళ్లంతా బురద, చెత్తతో నిండిపోయిందని చేతులతో బురదను ఎత్తి ఇళ్లు శుభ్రం చేసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఇంతలా వానలు మొదటి సారి వచ్చాయని అన్నారు. ఇంట్లో బురదల వల్ల దోమలు వ్యాపించి అనారోగ్యాలకు గురి కావాల్సి వస్తుందేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఇంటి మరమ్మతులు, ఇంటిని శుభ్రం చేయడం, వస్తువులను తరలించడం వంటి వాటికి పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఇళ్లు కూలిన వారికి ప్రభుత్వం ప్రత్యేక పరిహారం ఇవ్వాలని బాధితులు వేడుకుంటున్నారు.

## మహిళా కార్మికులకు 10 కోట్ల లాటరీ

**జయభేరి, తిరువనంతపురం :**

కేరళకు చెందిన పదకొండు మంది మహిళ కార్మికులకు లాటరీ రూపంలో అదృష్టం వరించింది. వారందరూ కలిసి కేవలం రూ. 250లతో కొనుగోలు చేసిన లాటరీ టికెట్‌కు ఏకంగా రూ.10 కోట్ల జాక్‌పాట్ తగిలింది. దాంతో ఆ 11మంది మహిళలు రాత్రికిరాత్రే లక్షాధికారులైపోయారు. ఇక ఈ 250 రూపాయల లాటరీ టికెట్ కోసం 11 మంది మహిళలు డబ్బులు పోగేసి మరీ కొనుగోలు చేశారు. చివరికి వారికి అదృష్టం కలిసి రావడంతో రూ.10 కోట్లు గెలుచుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే..మలప్పురం పరిధిలోని పరప్పనంగడి మున్సిపాలిటీ కి చెందిన హరిత కర్మ సేనకు చెందిన కొందరు పేద మహిళలు స్థానికంగా నాన్ బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ ప్లాంట్‌కు తరలిస్తుంటారు. అలా వచ్చే ఆ కొద్ది పాటి ఆదాయమే వారికి జీవనాధారం. ఈ క్రమంలోనే వారు లాటరీ ద్వారా తమ అదృష్టాన్ని మార్చుకోవాలనుకున్నారు. కానీ, లాటరీ టికెట్ కొనుగోలు చేసే స్తోమత కూడా వారికి లేకపోవడంతో..అందరూ కలిసి డబ్బులు పోగేసి రూ.250 విలువ చేసే లాటరీ టికెట్ కొనుగోలు చేశారు. వారిలో తొమ్మిది మంది తలో రూ.25 ఇచ్చారు. మరో ఇద్దరు రూ12.50 వేసుకుని..రూ.250తో లాటరీ టికెట్ కొనుగోలు చేశారు.అలా మున్సిపల్ కార్మికులైన మహిళలంతా కలిసి డబ్బులు పోగేసి కొనుగోలు చేసిన లాటరీ టికెట్‌కు జాక్‌పాట్ తగిలింది. బుధవారం కేరళ లాటరీ డిపార్టుమెంటు వారు నిర్వహించిన డ్రాలో రూ.10 కోట్ల విలువ చేసే మాన్‌సూన్ బంపర్ లాటరీ తగిలింది.

# రోహిత్ చివరిసారి ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసినప్పుడు

# ఇండియా వరల్డ్ కప్ గెలిచిన విషయం తెలుసా?

రోహిత్ చివరిసారి ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసినప్పుడు ఇండియా వరల్డ్ కప్ గెలిచిన విషయం తెలుసా? తాజాగా అతడు వెస్టిండీస్ తో జరిగిన తొలి వన్డేలోనూ అదే స్థానంలో బ్యాటింగ్ కు దిగాడు. వెస్టిండీస్ తో జరిగిన తొలి వన్డేలో కెప్టెన్ రోహిత్ శర్మ ఓపెనింగ్ చేయకుండా ఏకంగా ఏడో స్థానంలో బ్యాటింగ్ కు దిగడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్ లను ఓపెనింగ్ పంపించారు. ఇక మూడో స్థానంలో రావాల్సిన కోహ్లీ కూడా డిమోట్ అయ్యాడు. ఏడో స్థానంలో వచ్చిన రోహిత్ 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇండియా ఐదు వికెట్లతో గెలిచింది. అయితే మ్యాచ్ తర్వాత తాను గతంలో ఏడో స్థానంలో బ్యాటింగ్ కు దిగిన సందర్భాన్ని రోహిత్ గుర్తు చేసుకున్నాడు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. రోహిత్ ఇలా ఏడోస్థానంలో బ్యాటింగ్ కు దిగిన ఏడాదే ఇండియా వరల్డ్ కప్ గెలిచింది. చివరిసారి 2011 జనవరిలో సౌతాఫ్రికాతో వన్డేలో ఏడో స్థానంలో రోహిత్ బ్యాటింగ్ చేశాడు. అయితే ఆ వరల్డ్ కప్ జట్టులో రోహిత్ కు చోటు దక్కలేదు. కానీ ఇప్పుడు కూడా మరో రెండు నెలల్లో వరల్డ్ కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రోహిత్ ఏకంగా కెప్టెన్ గా ఉన్నాడు. మరి ఈసారి కూడా ఆ సెంటిమెంట్ రిపీట్ అవుతుందా అన్న ఆశతో అభిమానులు ఉన్నారు. తన బ్యాటింగ్ స్థానంపై మ్యాచ్ తర్వాత రోహిత్ స్పందిస్తూ.. "నేను ఇండియా తరపున అరంగేట్రం చేసినప్పుడు ఏడో స్థానంలో ఆడాను. నాకు ఆ రోజులు గుర్తుకు వచ్చాయి. 2011 నాకు అసలు కలిసి రాలేదు. వరల్డ్ కప్ జట్టులో నేను లేను. దానికి నన్ను నేనే నిందించుకోవాలి. నేను నా ఆటపై దృష్టి సారించాను. యోగా, మెడిటేషన్, ఒంటరిగా ఉండటం నాకు చాలా సాయం చేశాయి. నేను మారాల్సిన అవసరం ఉందని, ఒకవేళ నేను మెరుగవ్వకపోతే మళ్లీ క్రికెట్ ఆడలేను అన్న విషయం అర్థమైంది. 201415 మధ్య నేను చాలా మారాను. లేదంటే నేను కొనసాగలేనన్న విషయం నాకు అర్థమైంది" అని



రోహిత్ అన్నాడు. వన్డే స్పెషలిస్టులకు క్రీజులో తగినంత సమయం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే తాను, విరాట్ బ్యాటింగ్ ఆర్డర్ లో దిగువన రావాలని నిర్ణయించుకున్నట్లు రోహిత్ చెప్పాడు. తొలి వన్డేలో ఇండియా 5 వికెట్లతో గెలిచి మూడు వన్డేల సిరీస్ లో 10 ఆధిక్యం సంపాదించిన విషయం తెలిసిందే.



## జడేజా.. కుల్దీప్ అరుదైన రికార్డు..

## 49 ఏళ్లలో ఇదే తొలిసారి

జడేజా, కుల్దీప్ అరుదైన రికార్డు క్రియేట్ చేశారు. 49 ఏళ్లలో ఇండియా తరపున వీళ్లు సాధించిన రికార్డు ఇదే తొలిసారి కావడం విశేషం. వెస్టిండీస్ తో జరిగిన తొలి వన్డేలో ఈ స్పిన్నర్లు ఈ ఘనత సాధించారు. టీమిండియా స్పిన్నర్లు వెస్టిండీస్ తో జరిగిన తొలి వన్డేలో చెలరేగిన విషయం తెలుసు కదా. జడేజా, కుల్దీప్ లెఫ్టామ్ స్పిన్ ధాటికి.. విండీస్ కుప్పకూలింది. కేవలం 23 ఓవర్లలోనే 114 పరుగులకే చేతులెత్తేసింది. కుల్దీప్ 4 వికెట్లు, జడేజా 3 వికెట్లు తీసుకున్నారు. ఇద్దరూ కలిసి ఏడు వికెట్లు తీశారు. ఇలా ఇండియా తరపున ఓ వన్డే మ్యాచ్ లో ఇద్దరు లెఫ్టామ్ స్పిన్నర్లు 7 వికెట్లు తీయడం ఇదే తొలిసారి. ఇద్దరిలో కుల్దీప్ చెలరేగిపోయాడు. అతడు కేవలం 3 ఓవర్లలోనే 6 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. కెప్టెన్ షాయ్ హోప్ (43)తోపాటు డొమినిక్ డ్రేక్స్, యానిక్ కారియా, జేడెన్ సీల్స్ లను కుల్దీప్ ఔట్ చేశాడు. మరోవైపు జడేజా డేంజరస్ బ్యాటర్ హెట్‌మయర్ తోపాటు రోవ్‌మన్ పావెల్, రొమారియో షెపర్డ్ లను పెవిలియన్ కు పంపించాడు. కుల్దీప్ కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. జడేజా లెఫ్టామ్ ఆఫ్ స్పిన్నర్ కాగా.. కుల్దీప్ లెఫ్టామ్ లెగ్ స్పిన్నర్ అయిన విషయం తెలిసిందే. 49 ఏళ్ల వన్డే క్రికెట్ చరిత్రలో ఇండియా తరపున ఒక మ్యాచ్ లో 7 అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన తొలి లెఫ్టామ్ స్పిన్ జోడీగా జడేజా, కుల్దీప్ నిలిచారు. వీళ్ల దెబ్బకు విండీస్ కుప్పకూలడంతో ఇండియా మరో 27 ఓవర్లు మిగిలి ఉండగానే విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్ లో 10 లీడ్ లోకి దూసుకెళ్లింది. పిచ్ కాస్త స్పిన్ కు అనుకూలిస్తూ బౌన్స్ కూడా ఉండటంతో తమ పని సులువైందని మ్యాచ్ తర్వాత కుల్దీప్ అన్నాడు. 115 పరుగుల లక్ష్యాన్ని ఇండియా 22.5 ఓవర్లలోనే చేజ్ చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ 52 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్ లో కెప్టెన్ రోహిత్ ఓపెనర్ గా కాకుండా ఏకంగా ఏడో స్థానంలో బ్యాటింగ్ కు దిగడం విశేషం.

## ధోనీ ఫిట్‌నెస్ గురించి సాక్షిని అడిగిన ఫ్యాన్స్..

ఎంఎస్ ధోనీ ఫిట్‌నెస్ గురించి అతడి భార్య సాక్షిని అడిగారు అభిమానులు. దీనికి ఆమె స్పందించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీమిండియా మాజీ కెప్టెన్, దిగ్గజ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ ఈ ఏడాది మేలో మోకాలికి సర్జరీ చేయించుకున్నాడు. ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో తన జట్టు చెన్నై సూపర్ కింగ్స్ ను విజేతగా నిలిపాడు ధోనీ. సీఎస్కేకు ఐదోసారి ఐపీఎల్ టైటిల్ అందించాడు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ మొత్తం మోకాలి గాయంతో కుంటుకుంటూనే ఆడాడు ఎంఎస్ ధోనీ. సారథిగా జట్టును విజయపథంలో నడిపాడు. అయితే, సీజన్ ముగియగానే శస్త్రచికిత్స చేయించున్నాడు. దీంతో ధోనీ ఫిట్‌నెస్ ఎలా ఉందోనని అభిమానులు ఆలోచిస్తున్నారు. ఈ తరుణంలో ధోనీ ఫిట్‌నెస్ గురించి అతడి భార్య సాక్షిని కొందరు అభిమానులు అడిగారు. దీనికి ఆమె స్పందించారు. ధోనీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ కింద ఎంఎస్ ధోనీ, సాక్షి తొలి చిత్రంగా ఎల్‌జీఎం (లెట్స్ గెట్ మ్యారీడ్)ను నిర్మించారు. ఈ చిత్ర ప్రమోషన్లలో సాక్షి బిజీగా ఉన్నారు. వరుసగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ధోనీ ఎలా ఉన్నాడని కొందరు అభిమానులు సాక్షిని ఓ ఈవెంట్లో అడిగారు. దీనికి ఆమె స్పందించారు. “మహీ భాయ్ ఎలా ఉన్నాడు, మహీ భాయ్ ఫిట్‌నెస్ ఎలా ఉంది?” అని కొందరు అభిమానులు అరుస్తూ సాక్షిని అడిగారు. దీనికి సాక్షి స్పందించారు. “మహీ భాయ్ కోలుకుంటున్నాడు” అని ఫ్యాన్స్‌కు చెప్పారు సాక్షి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వచ్చే ఏడాది ఐపీఎల్‌లో ధోనీ ఆడతాడా లేదా అనే విషయం ఉత్కంఠగా మారింది. శరీరం సహకరిస్తే ఆడాలనే ఉందని ఈ ఏడాది ఫైనల్ తర్వాత మహీ చెప్పాడు. కాగా, ధోనీ బ్యానర్‌లో వచ్చిన ఎల్‌జీఎం సినిమా థియేటర్లలో విడుదలైంది. తమిళంతో పాటు తెలుగులోనూ రిలీజ్ అయింది. ఈ చిత్రంలో హరీశ్ కల్యాణ్, లవ్ టుడే ఫేమ్ ఇవానా హీరోహీరోయిన్లుగా నటించారు. రమేశ్ తమిళమణి ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. మ్యూజిక్ డైరెక్టర్, కథ, స్క్రీన్ ప్లే కూడా అతడే అందించాడు. కాగా, ఎల్‌జీఎం చిత్రం మిశ్రమ స్పందన అందుకుంటోంది.



## రాష్ట్రంలోని 1000 గ్రామాల్లో గంగదేవిపల్లి గ్రీన్ మోడల్

**జయభేరి, హైదరాబాద్ :**

దేశంలో మొట్టమొదటి గ్రీన్ బిల్డింగ్, గ్రీన్‌హోమ్, గ్రీన్ ఎయిర్‌పోర్టు లాంటివి గర్వకారణమని తెలంగాణ ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్ర సచివాలయం, జిల్లా కలెక్టరేట్లను గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌లో నిర్మించామని ఆయన చెప్పారు. గ్రీన్‌బిల్డింగ్ కౌన్సిల్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన గ్రీన్ ప్రాపర్టీ షోను ప్రారంభించి, మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ మానసపుత్రిక హరితహారంతో తెలంగాణలో గ్రీన్ కవర్ 33 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు.ఇంకా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ‘తెలంగాణ ప్రభుత్వం తరపున CIIIGBCకి పూర్తి సహకారం అందిస్తాం. రాష్ట్రంలో గ్రీన్ బిల్డింగ్ అనేక రికార్డులను కలిగి ఉంది. భారతదేశపు మొదటి గ్రీన్ బిల్డింగ్, గ్రీన్ హోమ్, గ్రీన్ ఎయిర్‌పోర్ట్, గ్రీన్ రైల్వే స్టేషన్, గ్రీన్ ఫ్యాక్టరీ ఇలా ఇవన్నీ గ్రీన్ బిల్డింగ్ విజయాలు.

ఈ గ్రీన్ బిల్డింగ్ వల్ల దేశంలో గ్రీన్ ఇండ్లు పెరుగుతున్నాయి. CIIIGBC హైదరాబాద్‌లో 10.27 బిలియన్ చదరపు అడుగుల్లో నిర్మాణాలు పూర్తిచేసింది’ అని చెప్పారు.కొత్త సచివాలయ భవనం, టీహబ్, టీవర్క్స్, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, కొత్త కలెక్టరేట్ భవనాలు, ఆస్పత్రులు, హెల్త్‌కేర్ క్యాంపస్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ఐటీ టవర్లలో గ్రీనరీ ఇంప్లిమెంట్ చేయడం ద్వారా తెలంగాణ పచ్చని బాటలో నడుస్తోందని మంత్రి కేటీఆర్ చెప్పారు. భవనాలు, క్యాంపస్‌లు మాత్రమే కాకుండా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌లలో IGBC ద్వారా గ్రీన్ సిటీస్ రేటింగ్ పెరుగుతోందని పేర్కొన్నారు.తెలంగాణకు హరిత హారం ద్వారా రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో 24% నుంచి 33% శాతం వరకు పచ్చదనం పెరిగిందని మంత్రి చెప్పారు. చెట్ల విస్తరణను గణనీయంగా పెంచుకున్నామని, దాంతో రాష్ట్రం మొత్తం పచ్చదనం పెరిగిందని తెలిపారు.

నగరాలేగాక రాష్ట్రంలోని చాలా గ్రామాల్లో కూడా గ్రీన్ బిల్డింగ్ సూత్రాలను అవలంభించాలని కోరుకుంటున్నామని చెప్పారు. గంగదేవిపల్లి స్ఫూర్తిగా రాష్ట్రంలోని వెయ్యి గ్రామాలను గ్రీన్ విలేజెస్‌గా మార్చేందుకు IGBC సహకారం కావాలన్నారు.గ్రామీణ విద్యుదీకరణ, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, మున్సిపల్ వ్యర్థాల నిర్వహణను మెరుగుపర్చడానికి, గ్రామాలు పచ్చగా మారడానికి వీలుగా పటిష్టమైన మౌలిక సదుపాయాల కల్పనపై తాము దృష్టి పెడుతున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, సైదిరెడ్డి, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, సీఐఐ తెలంగాణ చైర్మన్, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో మున్నేరు వాగుకు వరద పోటు

**జయభేరి, హైదరాబాద్ :**

భారీ వర్షాలతో మున్నేరు వాగుకు వరద పోటెత్తింది. ఖమ్మం నగరాన్ని ముంచెత్తిన మున్నేరు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఐతవరం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో విజయవాడ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు కోదాడ వద్ద దారి మళ్లిస్తున్నారు హైదరాబాద్ నుంచి వెళ్తున్న వాహనాలను హుజూర్‌నగర్, మిర్యాలగూడ, పిడుగురాళ్ల మీదుగా విజయవాడకు వెళ్లేలా ఏర్పాటు చేశారు.

**ఖమ్మంను ముంచెత్తిన మున్నేరు**

ఖమ్మం నగరంలోని మున్నేరు పరీవాహక ప్రాంతం వరదలో చిక్కుకున్న 27 మందిని ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు గురువారం రాత్రి రక్షించాయి. సహాయక చర్యల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్‌తో కలిసి అనుక్షణం పర్యవేక్షించారు. మున్నేరు వరద ఉధృతి పెరగడంతో మైక్‌తో అప్రమత్తం చేస్తూ ఇళ్లల్లో చిక్కుకున్న వారిని రక్షించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎన్డీఆర్‌ఎఫ్ కమాండర్, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ నేతృత్వంలో విశాఖపట్నం నుంచి వచ్చిన ప్రత్యేక బృందం లోతట్టు ప్రాంతాలైన పద్మావతి నగర్, గుర్రం ఫంక్షన్ హాల్ ప్రాంతం, మంచికంటి నగర్, బొకలగడ్డ వెంకటేశ్వర నగర్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించింది. ఇళ్లలో, మేడపై మిగిలి ఉన్న బాధితులను రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

పద్మావతి నగర్‌లోని ధ్యాన మందిరంలోని భవనంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు రెండు బృందాలుగా ఏర్పడి ఘటనా స్థలానికి చేరుకున్నాయి. భవనం రెండో అంతస్తులో బిక్కు బిక్కు మంటూ భయాందోళనలో ఉన్న మునగాటి లక్ష్మీనారాయణ, మునగాటి లక్ష్మీదేవి, మునగాటి యశ్వంత్, ప్రవల్లిక, అరవింద్, కావ్య, విఘ్నేష్ 5 నెలల బాబు తోపాటు బొక్కలగడ్డ వెంకటేశ్వర నగర్‌కు చెందిన 20మందిని ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి.

## మానవసహిత అంతరిక్ష యాత్ర దిశగా ఇస్రో మరో ముందడుగు

**జయభేరి, బెంగళూరు :**

గగన్‌యాన్ ప్రయోగం దిశగా ఇస్రో మరో ముందడుగు వేసింది. మానవసహిత అంతరిక్ష యాత్ర కలను సాకారం చేసుకునే దిశగా కీలక పరిణామం చోటుచేసుకున్నది. ఇస్రో చేపట్టిన ప్రతిష్ఠాత్మక మిషన్‌లో కీలక పాత్ర పోషించే ప్రొపల్షన్ సిస్టమ్ పనితీరును మెరుగుపరిచేందుకు గానూ చేపట్టిన పరీక్ష విజయవంతమైంది. ఈ మేరకు గురువారం ఇస్రో వెల్లడించింది. తమిళనాడు రాష్ట్రం మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ పరీక్షలు నిర్వహించారు. గగన్‌యాన్‌కు సంబంధించిన సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ (ఎస్‌ఎంపీఎస్) పనితీరును శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. ఈ పరీక్షలు ప్రొపల్షన్ పనితీరును ధ్రువీకరిస్తాయి. వీటిలో వచ్చే ఫలితాల ఆధారంగా దాని పనితీరును శాస్త్రవేత్తలు మరింత మెరుగుపరుస్తారు.

**మూడు రోజుల యాత్ర**...

మానవసహిత అంతరిక్ష యాత్రలో భాగంగా ఇస్రో గగన్‌యాన్‌ను ప్రారంభించింది. ఈ యాత్ర మూడు రోజుల పాటు ఉంటుంది. ఈ మిషన్‌లో భాగంగా ముగ్గురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌకను భూమికి 400 కి.మీ దూరంలోని కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. మూడు రోజుల అనంతరం వ్యోమగాములను సురక్షితంగా భూమిపైకి చేర్చడమే ఇస్రో లక్ష్యం.


**మరో మూడు పరీక్షలు**...

సర్వీస్ మాడ్యూల్ సిస్టమ్ డిమాన్‌స్ట్రేషన్ మాడల్ (ఎస్‌ఎంఎస్‌డీఎం)ఫేజ్ 2 టెస్టుల్లో భాగంగా రెండో, మూడో హాట్ టెస్టులను తాజాగా నిర్వహించారు. ఇందులో భాగంగా అన్ని ఇంజిన్ల పనితీరును సమీక్షించారు. థ్రస్టర్ ఇంజిన్లను కంటిన్యూయస్, పల్స్ మోడ్‌లలో విజయవంతంగా పరీక్షించినట్టు ఇస్రో తెలిపింది. ఈనెల 19న మొదటి హాట్ టెస్టును ఇస్రో నిర్వహించింది. వీటితో పాటు మరో మూడు హాట్ టెస్టులను నిర్వహించనున్నట్టు ఇస్రో వర్గాలు తెలిపాయి. ఈ సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ (ఎస్‌ఎంపీఎస్)ను బెంగళూరు, తిరువనంతపురంలోని వలియామలలో ఉన్న లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్లలో అభివృద్ధి చేశారు. ‘తరువాతి టెస్టులో 350 సెకన్లు లక్ష్యంగా పెట్టుకున్నాం. తదుపరి పరీక్షను చివరి కక్ష్యను చేరుకునేందుకు వీలుగా నిర్వహించనున్నాం. అందులో భాగంగా ఎల్‌ఏఎం ఇంజిన్లను కంటిన్యూయస్ మోడ్‌లో, ఆర్‌సీఎస్ థ్రస్టర్లను పల్స్ మోడ్‌లో మండించనున్నాం’ అని ఇస్రో తెలిపింది.

# ఆసుపత్రిలో రోబోటిక్ సేవలు

**జయభేరి, విజయవాడ :**

వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం దిశగా అడుగులు వేసింది విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్. అడ్వాన్స్ టెక్నాలజీ రోబో తో వివిధ విభాగాల్లో వైద్యసేవలను అందించనుంది. ఫలితంగా సంక్లిష్ట సర్జరీలు కూడా సులభతరం కానున్నాయి. ఈ మేరకు గురువారం రాష్ట్ర గవర్నర్ కొత్త రోబో సేవలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ వైద్యరంగానికి విశిష్ఠ సేవలందించిన మణిపాల్ హాస్పిటల్ విజయవాడ మరో సరికొత్త అధ్యాయానికి తెరతీసింది. నాల్గో తరానికి చెందిన డా విన్సీ × రోబోను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ రోబోను ఏపీ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ... వైద్యరంగంలో మరోకొత్త చరిత్రకు మణపాల్ హాస్పిటల్ తెరతీసిందని చెప్పారు. రొబోటిక్ అసిస్టెడ్ సర్జరీ తో ఆంధ్రప్రదేశ్ వైద్యరంగం మరో కీలక మైలురాయిని అందుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని తెలిపారు. మణిపాల్ హాస్పిటల్స్ వారు ప్రవేశపెట్టిన ఈ స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ అడ్వాన్స్‌మెంట్ అనేది ఏపీ ఆరోగ్య సంరక్షణ సాంకేతికతలో ఒక గొప్ప ముందడుగు అని స్పష్టం చేశారు. రోబోటిక్ సర్జరీతో రోగులకు కచితత్వం ఉంటుందని చెప్పుకొచ్చారు. రోగులు త్వరగా కోలుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ సాంకేతిక ఆవిష్కరణతో శస్త్రచికిత్సా విధానంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయన్నారు. ఇలాంటి సాంకేతిక ఆవిష్కరణలతో భారతదేశ వైద్య చరిత్రలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు.మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డా. సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ... విజయవాడ పరిసర ప్రాంతాల్లోని వైద్యరంగంలో అత్యాధునిక వైద్య సాంకేతికతను ముందుకు తీసుకురావలన్నదే మణిపాల్ హాస్పిటల్ విజయవాడ లక్ష్యమని తెలిపారు. అత్యంత నైపుణ్యతగల సర్జన్స్, పోస్ట్ ఆపరేటివ్, రీ హాబ్ కేర్ నిపుణుల బృందంతో అత్యున్నత ప్రమాణాల వైద్యసేవలను అందించడానికి తాము అంకితభావంతో ఉన్నామని తెలిపారు. భారతదేశంలో డా విన్సీ × (4వ తరం) సిస్టమ్స్ సర్జికల్ టెక్నాలజీలో అత్యాధునికమైనదని, దీనిని హాస్పిటల్ నందు నెలకొల్పామని తెలిపారు. ఈ సాంకేతిక అద్భుతం అన్ని వర్గాల ప్రజలు అత్యున్నత వైద్యసేవలు పొందడానికి తోడ్పడుతుందని గుర్తు చేశారు.సంక్లిష్టమైన కేసులు నిర్వహించడానికి ఇది సర్జన్లకు తోడ్పడుతుంది. దాయ శస్త్ర చికిత్సా విధానంలో గల పరిమితులను అధిగమించడానికి మరియు కష్టతరమైన శస్త్రచికిత్సలను నిర్వహించే సర్జన్స్ యొక్క సామర్థ్యాన్ని పెంచడానికి ఇది ఉద్దేశించబడింది. సర్జికల్ ఆంకాలజి, సర్కిల్ గ్యాస్ట్రో ఇంటెసినల్, బేరియాట్రిక్, యూరాలజి, థొరాసిక్, జనరల్సరరీ, గెనకాలజి మరియు ఇంకా ఎన్నో స్పెషాలటీస్ విభాగాలలో రొబోటిక్ అసిస్టెడ్ సర్జరీలు నిర్వహించబడతాయి. రొబోటిక్ అసిస్టెడ్ సర్జరీ ద్వారా లాభాలు ఎన్నో ఉన్నాయి.



## జైలర్ ఆడియో లాంచ్.. స్పెషల్ అట్రాక్షన్‌గా తమన్నా

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం జైలర్. టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. జైలర్ ఆగస్టు 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. డియో లాంఛింగ్ ఈవెంట్‌కు తలైవా, డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్‌తోపాటు నిర్మాతలు, నటీనటులు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈవెంట్‌లో అభిమానుల కోసం 1000 ఉచిత పాస్‌లను జారీ చేస్తున్నట్టు ప్రకటించిన వెంటనే.. కేవలం 15 సెకన్లలో మొత్తం పాస్‌లు క్లెయిమ్ చేసుకున్నారని మేకర్స్ ఇప్పటికే అప్‌డేట్ అందించారు. యాక్షన్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీలో మలయాళ సూపర్ స్టార్ హీరో మోహన్ లాల్, సునీల్, తమన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే సినిమాలోని పాత్రలను ఇంట్రడ్యూస్ చేస్తూ విడుదల చేసిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. జైలర్‌లో కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్, రమ్యకృష్ణ, యోగిబాబు, వసంత్ రవి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తుండగా.. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. రజినీకాంత్ మరోవైపు జై భీమ్ ఫేం టీజే జ్ఞానవేళ్ దర్శకత్వంలో తలైవా 170 కూడా ప్రకటించాడని తెలిసిందే. లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.





## దుల్కర్ మూవీ.. మాస్ మసాలా సాంగ్ రిలీజ్

దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న కింగ్ ఆఫ్ కోటా నుంచి ఫస్ట్ సాంగ్ రిలీజ్ అయింది. ఈ చిత్రంలో ఇది స్పెషల్ సాంగ్‌గా ఉంది. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం పవర్‌ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ మూవీ 'కింగ్ ఆఫ్ కోటా' చేస్తున్నాడు. ఈ చిత్రంలో గ్యాంగ్‌స్టర్‌గా దుల్కర్ కనిపించనున్నాడు. ఇప్పటికే ఫస్ట్ లుక్, టీజర్‌లతో కింగ్ ఆఫ్ కోటా చిత్రంపై అంచనాలు భారీగా పెరిగాయి. పాన్ ఇండియా రేంజ్‌లో నాలుగు భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. కాగా, జూలై 28 దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు సందర్భంగా 'కింగ్ ఆఫ్ కోటా' చిత్రం నుంచి తొలి పాటను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. ఫుల్ మాస్ బీట్‌తో ఈ సాంగ్ ఉంది. "అసురుడే రావణ.. అదిరే అసురా" అంటూ కింగ్ ఆఫ్ కోటాలోని ఈ తొలి సాంగ్ తెలుగులో ప్రారంభమైంది. మొత్తంగా ఇది ఓ మాస్ పార్టీ సాంగ్‌గా ఉంది. దుల్కర్ రఫ్, రగెడ్ లుక్‌లో అదరగొట్టాడు. హల్లా మచారే అంటూ ఫాస్ట్ బీట్‌లో సాగింది ఈ సాంగ్. కింగ్ ఆఫ్ కోటా నుంచి ఈ ఫస్ట్ సింగిల్ మలయాళం, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రిలీజ్ అయింది. ఈ చిత్రానికి జేక్స్ బెజోయ్ సంగీతం అందించాడు. 'హల్లా మచారే' తెలుగు పాటను రేవంత్, సింధుజ శ్రీనివాసన్ ఆలపించారు. కృష్ణ కాంత్ రిలిక్స్ అందించాడు. రితికా సింగ్ ఈ స్పెషల్ సాంగ్‌లో చిందేసింది. కింగ్ ఆఫ్ కోటా చిత్రానికి అభిలాష్ జోషి దర్శకత్వం వహిస్తున్నాడు. 1980,90ల బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉండనుంది. దుల్కర్ సల్మాన్ తొలిసారి గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తుండడంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. మలయాళంలో రూపొందుతున్న కింగ్ ఆఫ్ కోటా సినిమా తెలుగు, హిందీ, తమిళంలోనూ విడుదల కానుంది. కింగ్ ఆఫ్ కోటా మూవీలో దుల్కర్ సరసన హీరోయిన్‌గా ఐశ్వర్య లక్ష్మి నటిస్తోంది. డ్యాన్సింగ్ రోజ్ షబీర్, ప్రసన్న, ప్రసన్న, నైలా ఉషా, చెంబన్ వినోద్, గోకుల్ సురేశ్, షమ్మీ తిలకన్, శాంతి కృష్ణ కీలక పాత్రలు పోషించారు. దుల్కర్ సల్మాన్ తన బ్యానర్ వేఫారర్ కింద జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఈ చిత్రాన్ని నిర్మించాడు. ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండనుంది. ఈ చిత్రాన్ని ఆగస్టులో రిలీజ్ చేయాలని మూవీ యూనిట్ భావిస్తోంది. అయితే, రిలికల్ సాంగ్‌లో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రస్తావించలేదు.

## ఖుషి టైటిల్ సాంగ్ వచ్చేసింది.. మెలోడియస్‌గా.. మైమరిపించేలా!

ఖుషి సినిమా నుంచి టైటిల్ సాంగ్ రిలీజ్ అయింది. హేషమ్ అబ్దుల్ వాహబ్ స్వరపరిచిన ఈ పాట కూడా మెలోడియస్‌గా ఉంది. ఖుషి సినిమా నుంచి మూడో పాట వచ్చేసింది. మెలోడియస్‌గా ఈ లవ్ సాంగ్ ఉంది. 'ఖుషి.. నువ్వు కనపడితే' అంటూ సాగే ఈ లిరికల్ సాంగ్‌ను మూవీ యూనిట్ జూలై 28 విడుదల చేసింది. స్టార్ హీరో విజయ్ దేవరకొండ, స్టార్ హీరోయిన్ సమంత నటిస్తున్న ఖుషి చిత్రానికి హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నాడు. ఫీల్ గుడ్ సినిమాలకు ఫేమస్ అయిన శివ నిర్వాణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఖుషి నుంచి వచ్చిన రెండు పాటలు సూపర్ హిట్ కాగా.. నేడు మూడో లిరికల్ సాంగ్ రిలీజ్ అయింది. హీరో విజయ్ దేవరకొండ ఆనందంలో మునిగి తేలుతున్నట్టు ఖుషి టైటిల్ సాంగ్ ఉంది. హీరోయిన్ సమంతతో ప్రేమలో పడిన తర్వాత పాడుకునే సాంగ్‌గా మెలోడియస్‌గా ఉంది. మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వాహబ్ స్వరాలు సమకూర్చటంతో పాటు తెలుగులో ఈ పాట పాడాడు. దర్శకుడు శివ నిర్వాణ ఈ పాటకు లిరిక్స్ రాశాడు. బృందా మాస్టర్ డ్యాన్స్ కంపోజ్ చేశారు. 'ఖుషి.. నువ్వు కనపడితే ఖుషి నీ మాట వినపడితే' అంటూ ఈ టైటిల్ సాంగ్ మొదలవుతుంది. సినిమాలో విజయ్, సమంత పెళ్లి విజువల్స్ కూడా ఈ లిరికల్ సాంగ్‌లో ఉన్నాయి. లిరిక్స్ కూడా చాలా క్యాచీగా ఉన్నాయి. అబ్దుల్ వాహబ్ వాయిస్ కూడా ఈ పాటకు బాగా సూటైంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లోనూ ఖుషి టైటిల్ సాంగ్ రిలీజ్ అయింది. ఆయా భాషను బట్టి సింగర్స్, లిరిక్ రైటర్స్ వేరుగా ఉన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేనీ, యలమంచలి రవిశంకర్ ఖుషి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రొమాంటిక్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు దర్శకుడు శివ నిర్వాణ. ఖుషి సినిమా థియేటర్లలో సెప్టెంబర్ 1వ తేదీన విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఖుషి సినిమాలో జయరామ్, మురళీ శర్మ, సచిన్ ఖేడకర్, లక్ష్మి, రోహిణి, వెన్నెల కిశోర్, శ్రీకాంత్ అయ్యంగార్ కీ రోల్స్ ప్లే చేశారు. కాగా, ఖుషి చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన 'నా రోజా నువ్వే', ఆరాధ్య పాటలు సూపర్ హిట్ అయ్యాయి. తెలుగుతో పాటు మిగిలిన భాషల్లోనూ మంచి ఆదరణ పొందుతున్నాయి. దీంతో సినిమాపై మంచి క్రేజ్ ఏర్పడింది.



## నడివీధిలో చిందులేస్తూ.. ఒంటిపై నీళ్లు పోయించుకుంటూ..

బాలీవుడ్ నటి, సోషల్ మీడియా స్టార్ షెర్లిన్ చోప్రా మరోసారి రచ్చరచ్చ చేసింది. వెరైటీ డ్రెస్‌లు ధరిస్తూ.. కొన్నిసార్లు వింత పనులు చేస్తూ సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు తరచూ పోస్ట్ చేస్తుంటుంది షెర్లిన్. హాట్ షో చేసే ఆమెకు సోషల్ మీడియాలో ఫుల్ ఫాలోయింగ్ ఉంది. సోషల్ మీడియాలో కొందరు ఆమెను ప్రశంసిస్తుంటే.. ఎక్కువ మంది ట్రోల్ చేస్తుంటారు. తాజాగా.. ముంబైలో నడివీధిలో డీప్‌నెక్ బ్లౌజ్ వేసుకొని డ్యాన్స్ చేసింది షెర్లిన్. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఆమెను కొందరు నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ముంబైలోని అంధేరి రోడ్డుపై ఇటీవల కనిపించింది షెర్లిన్ చోప్రా. ఎల్లో కలర్ ట్రాన్స్‌ప్రెంట్ చీర, క్లీవేజ్ కనిపించేలా డీప్ నెక్ బ్లౌజ్ ధరించింది. ఆ సమయంలో నడివీధిలోనే డ్యాన్స్ చేసింది. ఇద్దరు యువకులతో బాటిళ్లతో ఒంటిపై నీరు పోయించుకుంది. డ్యాన్స్ మూవ్స్ చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో బయటికి రావటంతో వైరల్ అయింది. దీంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. ఎక్కువ మంది షెర్లిన్‌ను ట్రోల్ చేస్తున్నారు. తిట్టిపోస్తున్నారు. ఈ వీడియో వైరల్ అవడంతో షెర్లిన్ చోప్రా పట్ల కొందరు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "అసహ్యకరంగా ఉంది. స్వేచ్ఛ పేరుతో ఇలాంటివి చేసే అనుమతి ఇవ్వకూడదు. వారిపై కోర్టు చర్యలు తీసుకోవాలి" అని ఓ యూజర్ కామెంట్ చేశారు. "వీరు మనుషులేనా.. మతి చెడిందా" అని ఓ యూజర్ రాసుకొచ్చారు. పిచ్చి పనులు చేస్తున్న షెర్లిన్ చోప్రాపై మహారాష్ట్ర పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మరో యూజర్ కామెంట్ చేశారు. మరికొందరు.. సిగ్గులేదా అంటూ షెర్లిన్‌ను తిట్టిపోస్తున్నారు. కాగా, ఇటీవలే ఓ యువకుడిని షెర్లిన్ చోప్రా ఇబ్బంది పెట్టింది. అతడిని దగ్గరికి లాక్కొని డ్యాన్స్ చేద్దామంటూ బలవంత పెట్టింది. డ్యాన్స్ చేసింది. దీంతో ఆ యువకుడు సిగ్గుపడ్డాడు. ఈ వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ యువకుడి వేధించిన షెర్లిన్‌పై కేసు నమోదు చేయాలని కొందరు నెటిజన్లు డిమాండ్ చేశారు.





## బ్లూ లెహంగాలో 'జాన్వీ' అందాల మెరుపులు..

ఓ ఫ్యాషన్ ఈవెంట్‌లో బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ అందంతో అదరగొట్టింది. ఆకర్షణీయమైన డ్రెస్‌లో హొయలు ఒలికిస్తూ వాక్ చేసింది. దేశంలోనే అతి పెద్ద ఫ్యాషన్ ఈవెంట్ అయిన ఇండియా కాటూర్ వీక్ ఢిల్లీ వేదికగా జరుగుతోంది. ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (FDCI) ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తోంది. చాలా మంది ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు వారి కలెక్షన్లను ఈ ఈవెంట్‌లో ప్రదర్శిస్తున్నారు. ఆకర్షణీయమైన, కొత్త ట్రెండ్, నయా ఫ్యాషన్ డ్రెస్‌లు ధరించి కొందరు హీరోయిన్లు, మోడల్స్ ఈ ఈవెంట్‌లో వాక్ చేస్తున్నారు. ఈ క్రమంలో బాలీవుడ్ యంగ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ బ్లూ కలర్ లెహెంగా వేసుకొని అందంగా మెరిసింది. బ్లూ లెహెంగా ధరించి ఈ ఈవెంట్‌లో స్టైలిష్ వాక్ చేసింది జాన్వీ కపూర్. వైబ్రెంట్‌గా, క్లీవేజ్ షో చేసేలా ఉన్న ఈ డ్రెస్ ధరించిన జాన్వీని చూసి అందరూ ఫిదా అయ్యారు. సన్నటి స్ట్రిప్స్, ప్లంగింగ్ నెక్‌లైన్ ఉన్న బ్లూ బ్రాలెట్ ధరించింది జాన్వీ. తళతళ మెరిసే ఫ్రీ ఫ్లోయింగ్ బ్లూ స్కర్ట్ వేసుకుంది. సీక్విన్ వర్క్, ఎంబ్రాయిడరీతో ఉన్న ఈ డ్రెస్ ఆకర్షణీయంగా ఉంది. ఈ డ్రెస్‌లో జాన్వీ అందంగా తళతళ మెరిసింది. వయ్యారంగా నడిచింది. ఈ బ్లూ డ్రెస్ ధరించి జాన్వీ అందాల మెరుపులు మెరిపించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జాన్వీ అందాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. జాన్వీ సొగసులకు ఫిదా అవుతున్నారు. ఆమె అందాన్ని పొడుగుతూ కామెంట్లు చేస్తున్నారు. జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ నటించిన బావల్ చిత్రం ఇటీవలే అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో రిలీజ్ అయింది. 2018లో బాలీవుడ్ మూవీ దఢక్‌తో తెరంగేట్రం చేసింది జాన్వీ. ఆ తర్వాత కొన్ని బాలీవుడ్ చిత్రాలు చేసింది. ఇక, యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తున్న దేవర చిత్రంలో టాలీవుడ్‌లో అడుగుపెడుతోంది జాన్వీ కపూర్.

## ఆహా ఓటీటీలోకి మరిన్ని హాలీవుడ్ సూపర్ హిట్ సినిమాలు..

ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి మరో ఐదు హాలీవుడ్ చిత్రాలు వచ్చాయి. వీటి స్ట్రీమింగ్ నేడు మొదలైంది. సబ్‌స్క్రైబర్లను పెంచుకునేందుకు ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్ వివిధ వ్యూహాలను ఫాలో అవుతోంది. కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లను జోరుగా తీసుకొస్తోంది. కొన్ని గేమ్ షోలు, సింగింగ్ షోలు సహా మరిన్ని కార్యక్రమాలను చేస్తోంది. ఇటీవల 'నేను సూపర్ ఉమెన్' అనే బిజినెస్ రియాల్టీ షోను తీసుకొచ్చింది. గతంలోనే ఇలా కొన్ని హాలీవుడ్ డబ్బింగ్ మూవీలను అందుబాటులోకి తెచ్చింది. తాజాగా, నేడు మరిన్ని హాలీవుడ్ సినిమాలను తెలుగు స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చింది. ది యాంగ్రీ బర్డ్స్ మూవీ, గూజ్‌బంప్స్ 2: హాంటెడ్ హాలోవీన్, 2012, అండర్ వరల్డ్ బ్లడ్ వార్, మెన్ ఇన్ బ్లాక్ (ఎంఐబీ): ఇంటర్నేషనల్ హాలీవుడ్ చిత్రాలు ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి నేడు అడుగుపెట్టాయి. తెలుగు డబ్బింగ్‌లో ఈ చిత్రాలు స్ట్రీమ్ అవుతున్నాయి. ఇప్పుడు ఆహా తన ప్లాట్‌ఫామ్‌లోకి తెలుగులో అందుబాటులోకి తెచ్చింది. 2012లో ప్రపంచం అంతమైపోతే అనే కాన్సెప్టుతో 2009లో వచ్చిన '2012' సినిమా సూపర్ హిట్ అయింది. ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్‌లను సాధించింది. ఇక 2016లో వచ్చిన ది యాంగ్రీ బర్డ్స్ మూవీ కూడా చాలా పాపులర్ అయింది. కాగా, సూపర్ హిట్ మూవీ సామజవరగమన సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. శ్రీవిష్ణు నటించిన ఈ సినిమా ఈ ఏడాది జూన్ 29న థియేటర్లలో విడుదలై సూపర్ హిట్ అయింది. సామజవరగమన చిత్రాన్ని శుక్రవారం నుంచి స్ట్రీమింగ్ చేస్తామని ఆహా ముందుగా ప్రకటించినా.. ఒకరోజు ముందుగానే అందుబాటులోకి తెచ్చింది.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com